# చాగంటి దర్శనమ్

## (పద్య ద్విశతి)



**86మంది కవులు సమర్పించిన పద్యస్తుతి**

# చాగంటి దర్శనమ్

(పద్య ద్విశతి)



86 మంది కవులు సమర్పించిన

## పద్య స్తుతి

# చాగంటి దర్శనమ్ (పద్య ద్విశతి)
86 మంది కవుల పద్య సంకలనము

ప్రథమ ముద్రణ : డిసెంబర్ 2023
ప్రతులు : 1000
వెల : శ్రద్ధాసక్తులు

ప్రతులకు :
మరుమాముల వెంకటరమణ శర్మ
దర్శనమ్ (ఆధ్యాత్మిక మాసపత్రిక)
29-105/4/1, న్యూ విద్యానగర్,
నేరెడ్‌మెట్, సికింద్రాబాద్ – 500 056
ఫోన్ : 94401 15469

డి.టి.పి. : కంది శంకరయ్య
కవర్ డిజైన్ : విట్టుబాబు
ముద్రణ : సాయి తిరుమల ప్రింటర్స్, హైదరాబాదు

# ప్రవృత్తేయం సరస్వతీ

'మచ్ఛందాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ'

అని బ్రహ్మదేవుడు వాల్మీకి మహర్షితో అన్న మాట 'చాగంటి దర్శనము' (పద్య ద్విశతి) పద్యసంకలనంలో పాలు పంచుకున్న ఎనభై ఆరు మంది అవధానులకు, కవులకు, యువకవులకు, బాలకవులకు, కవయిత్రులకు అందరికీ వర్తిస్తుంది. బ్రహ్మదేవుని సంకల్పంతోనే కవిత్వం పుట్టింది. వాల్మీకి ఆదికవి అయినాడు. కవి కావటం మన చేతిలో లేదు. "నువ్వు కవివైనావు" అనగానే వాల్మీకి "కోన్వస్మిన్ సాంప్రతం లోకే" అంటూ పదహారు లక్షణాలు, వానిలో కొన్ని అయినా ఉన్నవారి గురించే కవిత్వం వ్రాస్తానని కవులందరి పక్షాన ప్రతిజ్ఞ చేశాడు. ఈ పద్యసంకలనంలో కవులందరికీ అట్టి భాగ్యం లభించింది.

వృత్తం కథయ ధీరస్య యథా తే నారదాత్ శ్రుతమ్ ।
రహస్యం చ ప్రకాశం చ యద్ వృత్తం తస్య ధీమతః ॥

అన్న చోట సర్వనామం శ్రీరామునికే కాక ధీరులకు, ధీమంతులకు కూడా వర్తిస్తుంది. అట్టివారి రహస్యాలు, ప్రకాశాలు ఏవీ దాచకుండా వారి వృత్తాంతం మొత్తం స్పష్టంగా చెప్పటం కవి కర్తవ్యం అని బ్రహ్మదేవుడు కవులందరినీ హెచ్చరించాడు. వాల్మీకి 'కః సాంప్రతం అస్మిన్ లోకే' అని ప్రారంభించటం కవులకు వారివారి కాలాలలో ఈ లక్షణాలున్న మహాత్ముల చరిత్రలు వ్రాయటమే కవితాప్రయోజనంగా మార్గోపదేశం చేశాడు.

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారి ధర్మప్రవచన వైభవంలోని ఔన్నత్యాన్ని, ఆచరణీయతను, అనుశాసనాన్ని, ఆకర్షణీయతను, వ్యక్తిత్వవికాస, జీవన వికాస, మనోవికాస, బుద్ధివికాస, వైదికధర్మ వికాస దర్శనమే 'చాగంటి దర్శనము'గా సూక్ష్మంలో మోక్షంగా నామకరణం జరిగిన ఈ రెండు వందల పద్యాలూ అహమహమికతో పోటీ పడుతున్న వైనం పాఠకులకు, శ్రోతలకు అపరోక్షానుభూతిగా అందటమే సముచితం.

ఒకే మకుటంతో ఒకే వ్యక్తిని గురించి ఎనభై ఆరుమంది కవులు ఇంత వైవిధ్యంతో ఏ పద్యానికి ఆ పద్యమే తులసీదళంగా, బిల్వదళంగా సమర్పించి జగద్గురువుగా చాగంటి వారిని పద్యతులాభారంలో భక్తితో గెలిచిన కవులందరూ ధన్యులే. శార్దూలాలూ, మత్తేభాలూ మొకరిల్లాయి. ప్రవచన శారద స్రగ్విణిగా వెలుగొందింది. సంస్కృతం, ఆంధ్రం, అచ్చతెలుగు చాగంటివారేమిటో చాటి చెప్పాయి . ఇది వ్యక్తిత్వవాస్తవమే కాని వ్యక్తిస్తవం కాదు కనుక వాత్సల్యమూర్తులైన చాగంటివారు స్వీకరించి ఆశీర్వదింతురు గాక!

కవులందరి పక్షాన, దర్శనం పత్రిక పక్షాన సాష్టాంగప్రణామాలతో...

'కుదురాటగండ'

**పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**

# కృత్యంజలి

ప్రత్యేకించి ఏ బిరుదావళులు , పరిచయాలు అక్కర్లేని 'ప్రవచన చక్రవర్తి', 'శారదా జ్ఞాన పుత్రులు' బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు. వారి ప్రవచనం సమ్మోహనకరం. వారి వాగ్ధాటి భారతీయ వాఙ్మయ సుధాసారం. వారి హృదయం ధర్మనిష్ఠం. వారి జీవన విధానం ఆధ్యాత్మిక సద్భావనా పరిమళం. వారిని దర్శిస్తే కారణజన్ములైన ఒకానొక  ఋషికల్పుడు మనలను అనుగ్రహించడానికి మళ్లీ భూమిపైకి వచ్చాడేమో అని అనిపించక మానదు. సమస్త పురాణేతిహాసాలను సకల ధార్మిక ఆధ్యాత్మిక సందేశాలను సోదాహరణంగా అత్యంత సరళంగా మలచి  ప్రవచనాలు అందిస్తారు. వారి ప్రవచనాల సుధావార్ధిలో మునిగి తేలుతూ కోట్లాదిమంది శ్రోతలు మంత్రముగ్ధులవుతారు. ఆదిశంకరుల అద్వైత సిద్ధాంతాన్ని తమ జీవన మార్గంగా మలచుకున్న సంప్రదాయాభిజ్ఞులు వారు.  భగవత్తత్త్వ నిరూపణకే నిస్వార్థంగా తమ సర్వస్వాన్నీ స్వరపేటికను ధారపోస్తున్న పరమ భాగవతోత్తములు వారు. నిరాడంబర ప్రేమైక మూర్తులు. అసాధారణ ధారణ సంపన్నులు.

నిరంతరం  మనిషి మనీషిగా ఎదగడానికి జన్మ సార్థకత కోసం చేయవలసిన కర్తవ్యాల నిర్వహణ గురించి పరితపిస్తూ , ఐహికాముష్మిక ఫల సాధనల గురించి అద్భుత సందేశాలను ప్రవచనాలుగా అందించే చాగంటి కోటేశ్వరరావు గారికి సభక్తికంగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక 15వ వార్షికోత్సవాలలో 'గురుసత్కార' మందించింది. పల్లకీలో ఊరేగించి 'ధార్మిక వరేణ్య' బిరుదంతో, స్వర్ణ కంకణ సత్కారంతో, పుష్పాభిషేకంతో శారదా జ్ఞాన పుత్రుని (తేదీ 03-11-2019 న, రవీంద్ర భారతిలో) గౌరవించుకున్నది.

ఎందరెందరో ఆధ్యాత్మిక వేత్తల సాహితీమూర్తుల సమక్షంలో వేదకవి, వాగ్గేయకారులు బ్రహ్మశ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు గారు ప్రసంగిస్తూ "చాగంటి కోటేశ్వరా!" అన్న మకుటంతో పద్యం చెప్పి, ఇదే మకుటంతో విఖ్యాత కవి పండితులను తలా ఒక పద్యం చెప్పమని కోరారు. వెంటనే స్పందించిన ఎందరో కవి పండితులు 200 పద్యాలను అనతి కాలంలోనే అందించారు. కరోనా విజృంభణ వంటి అనేకానేక కారణాల వల్ల 'చాగంటి దర్శనమ్' ద్విశతి సిద్ధమైనప్పటికీ వెలుగు చూడలేదు. నాలుగేళ్ల సుషుప్తిలోంచి మేల్కొని ఈ ద్విశతి ఇప్పుడిలా ముస్తాబై మీముందుకొస్తుంది.

ఈ కృతికి కారణభూతులైన జొన్నవిత్తుల వారికి, అద్భుతమైన పద్యాలనందించిన విద్వత్కవులందరికీ, 'ప్రవృత్తేయం సరస్వతి' అనే ఆముఖాన్నందించిన 'కుదురాటగండ' డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ శతావధాని గారికి, అందమైన గ్రంథంగా అక్షరాలంకృతితో తీర్చిదిద్దిన  'సమస్యా పృచ్ఛక చక్రవర్తి' కంది శంకరయ్య గారికి, ముచ్చటైన ముఖచిత్రాన్ని తీర్చిదిద్దిన విట్టుబాబు గారికి సుమనోంజలులు. చాగంటి వారి కీర్తికిరీటంలో పొదిగిన మణుల వంటి ఈ పద్యాలను సహృదయు లాదరింతురుగాక!

'దర్శనమ్ సోదరులు'

**మరుమాముల దత్తాత్రేయ శర్మ**

**మరుమాముల వేంకట రమణ శర్మ**

# కవుల వరుస (అక్షరక్రమంలో)

సర్వశ్రీ...


1. అక్కిపెద్ది రామ సూర్యనారాయణ ..... 42
2. అబ్బిరెడ్డి పేరయ్య నాయుడు ..... 21
3. అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి ..... 43
4. అన్నాపంతుల జగన్నాథ రావు ..... 44
5. అమరవాది రాజశేఖర శర్మ ..... 43
6. అమళ్ళదిన్నె వేంకటరమణప్రసాద్ ..... 24
7. అయాచితం నటేశ్వరశర్మ ..... 18
8. అయ్యలసోమయాజుల సుబ్బారావు..... 50
9. అవుసుల భానుప్రకాశ్ ..... 24
10. అష్టకాల నరసింహరామ శర్మ ..... 12
11. ఆకెళ్ళ బాలభాను ..... 13
12. ఆముదాల మురళి ..... 15
13. ఎన్.వి.ఎన్. చారి ..... 37
14. ఎన్.సి హెచ్. చక్రవర్తి ..... 31
15. ఎస్. సాయిప్రసాద్ ..... 51
16. కందాళ వెంకట్ మోహన్ రావు ..... 32
17. కంది శంకరయ్య ..... 24
18. కడిమిళ్ళ వరప్రసాద్ ..... 10
19. కళ్ళే నరసింహం ..... 51
20. కవిశ్రీ సత్తిబాబు ..... 52
21. కొడుకుల పురుషోత్తమ్ ..... 42
22. కోగంటి వేంకటాచార్యులు ..... 34
23. కోగంటి వేంకటాచార్యులు ..... 47
24. కోట వేంకట లక్ష్మీనరసింహం ..... 10
25. గండ్లూరి దత్తాత్రేయ శర్మ ..... 13
26. గడిమెళ్ళ సోమయాజులు శర్మ ..... 35
27. గన్నవరం లలితాదిత్య ..... 19




28. గుండు మధుసూదన్ ..... 36
29. గుడిసేవ విష్ణు ప్రసాద్ ..... 45
30. గుడ్లూరి వేంకటేశ్వరరావు ..... 52
31. గుమ్మా సాంబశివరావు ..... 44
32. గౌరీభట్ల రఘురామ శర్మ ..... 23
33. చంద్రమౌళి రామారావు ..... 26
34. చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ ..... 31
35. చింతా రామకృష్ణారావు ..... 20
36. చేపూరి శ్రీరామ్ ..... 24
37. జంధ్యాల జయకృష్ణ బాపూజీ ..... 28
38. జంధ్యాల సుబ్బలక్ష్మి ..... 29
39. జి.యం. రామశర్మ ..... 16
40. జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు ..... 25
41. టేకుమళ్ళ వెంకటప్పయ్య ..... 45
42. డి.వి.యం. సత్యనారాయణ ..... 46
43. తపస్వీ ..... 48
44. తూములూరి దక్షిణామూర్తి ..... 53
45. తొగట సురేశ్ బాబు ..... 38
46. తోపెల్ల బాలసుబ్రహ్మణ్య శర్మ ..... 30
47. దేవరకొండ రామసుబ్రహ్మణ్య శర్మ ..... 53
48. నమిలకొండ సునీత ..... 49
49. నిడసనమెట్ల శేషగిరిరావు ..... 30
50. నేమాని సోమయాజులు ..... 19
51. పప్పు భోగారావ్ ..... 49
52. పాలడుగు శ్రీచరణ్ ..... 19
53. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ..... 14
54. పింగళి వేంకట కృష్ణారావు ..... 48
55. పుట్టపర్తి నాగపద్మిని ..... 46
56. పువ్వాడ తిక్కన సోమయాజి ..... 28
57. బుక్కపట్నం రామ మోహన్ ..... 55






58. బొమ్మరాజు ఆదినారాయణ ..... ..... ..... ..... 50

59. మద్దూరి రామమూర్తి ..... ..... ..... ..... ..... 18

60. మరుమాముల దత్తాత్రేయ శర్మ ..... ..... ..... ..... 16

61. మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి ..... ..... ..... 54

62. మాచవోలు శ్రీధరరావు ..... ..... ..... ..... ..... 54

63. మాడుగుల మురళీధర శర్మ ..... ..... ..... ..... 39

64. మావుడూరు సూర్య నారాయణ మూర్తి ..... ..... ..... 51

65. ముత్యంపేట గౌరీశంకరశర్మ ..... ..... ..... ..... 18

66. ముదిగొండ అమరనాథ శర్మ ..... ..... ..... ..... 11

67. ముద్దు రాజయ్య ..... ..... ..... ..... 20

68. మేడసాని మోహన్ ..... ..... ..... ..... 9

69. మోహన్ ..... ..... ..... ..... ..... 52

70. మైలవరపు మురళీకృష్ణ ..... ..... ..... ..... ..... 17

71. యలమర్తి మధుసూదన ..... ..... ..... ..... ..... 53

72. యస్వీ. రాఘవేంద్ర రావు..... ..... ..... ..... ..... 47

73. యెల్లికంటి జ్ఞానప్రసూనాశర్మ ..... ..... ..... ..... 54

74. రసరాజు ..... ..... ..... ..... ..... 47

75. రాంభట్ల పార్వతీశ్వర శర్మ ..... ..... ..... ..... 18

76. రాయప్రోలు సీతారామశర్మ ..... ..... ..... ..... 33

77. రాళ్ళబండి నాగభూషణ శాస్త్రి ..... ..... ..... ..... 40

78. రుద్రరాజు శ్యామల ..... ..... ..... ..... ..... 55

79. రేవూరు అనంతపద్మనాభ రావు ..... ..... ..... ..... 22

80. వజ్ఝల రంగాచార్య ..... ..... ..... ..... ..... 27

81. వద్దిపర్తి పద్మాకర్ ..... ..... ..... ..... 11

82. వంతుల విట్టుబాబు ..... ..... ..... ..... 55

83. వూదూరి జగదీశ్ ..... ..... ..... ..... ..... 41

84. వెంపటి కుటుంబ శాస్త్రి ..... ..... ..... ..... ..... 50

85. శ్రీపెరుంబూదూర్ లక్ష్మణమూర్తి ..... ..... ..... ..... 54

86. సురభి శంకరశర్మ ..... ..... ..... ..... ..... 20





# చాగంటి దర్శనము



శ్రీరామాయణ భారతాది కథానా శేముష్యుదాత్తార్థ వా
గ్ధారా బంధుర ధారణా కలిత విజ్ఞానాకృతీ! హైందవా
చార స్వాదువచః ప్రచోదనకళా సంపన్మతీ! మన్నుతుల్
సారస్యంబున స్వీకరింపుము తగన్! చాగంటి కోటేశ్వరా!

అదిగో ధూర్జటి వచ్చెనా మరల? విద్యానాథుడే వచ్చెనా?
చిదశేషోజ్జ్వలు డీశ్వరార్చన కళాశీలుండు శ్రీనాథుడే
ముదమొప్పారగ వచ్చెనా? యను తలంపున్ దోచు మిమ్ముం గనన్
సదనీభూత మహాకవీశ్వర వచస్సంసార! కోటేశ్వరా!

సామాన్యుల్ రసపారవశ్యముల హర్షస్వాంతులై పొంగగా
ధీమాన్యుల్ తమ జ్ఞానఖడ్గముల కుత్తేజంబు గల్పింపగా
మీ మాటల్ సకలాంధ్ర హృజ్జగములన్మేషింపగా జేసెఁ బ్ర
జ్ఞామూర్ధన్య! నమశ్శతంబు లివిగో చాగంటి కోటేశ్వరా!

భవదుద్యద్భరతార్షవాణి, సుకవీద్వ్యాప్యాహినీ శ్రేణిగా
రవణించున్ పటుబోధనంబులను నిష్ఠంకించి యాలించుచో
జవనాశ్వంబుల వేగవల్గితము లుత్సాహక్రియం దోపవే
స్తవనీయప్రతిభాకరా! రసధరా! చాగంటి కోటేశ్వరా!

నేలన్ నాల్గుచెఱంగులన్ మెలగుచున్ నెక్కొన్న తెల్గుందొరల్
హేలన్ మీ మధురాంధ్రభాషణకళా హిందోళ సంప్రేరణ
వ్యాలోలత్వము నూని, మాతృవచన వ్యాహారులై పొంగరే
సాలంకార వచోవిశేష చతురా! చాగంటి కోటేశ్వరా!

**'పంచసహస్రావధాని' మేడసాని మోహన్**



వల్మీక ప్రభవోక్త రామచరిత క్షీరార్ణవే భోగిరాట్
పారాశర్య మునీంద్ర నిర్మిత కవిత్వారణ్య పంచాననో
హ్యద్వైతామృత పూత దివ్య గిరిరాట్ కైలాస నందీశ్వరః
సో యం వక్తృకళా ప్రపూర్ణ మతిమాన్ చాగంటి కోటేశ్వరః!

పరుషాలాపములుండవెన్నడును తీవ్రస్థాయిలో వృత్తి మ
త్సరులెవ్వారు ధ్వజమ్ము నెత్తినను శాంతమ్మున్ స్థిత ప్రజ్ఞతా
గరిమమ్మున్ బ్రకటించు వ్యక్తితయె మోక్షద్వారమై యుంట యీ
శ్వర సాక్షాత్కృతి గాక వేరొకటియా! చాగంటి కోటేశ్వరా!

పలుకుల్ కావవి యావుపాల తొరకల్, పండంటి మా చంటి పి
ల్లలకున్ బట్టెడి యుగ్గుపాల తునకల్, లాలించి, లాలించి నో
ళులకందించెడి వెన్నముద్దలు పవళ్ళున్ రేలు చిన్నారి బొ
జ్జలపై దల్లుల చేతి రాపిడులహో! చాగంటి కోటేశ్వరా!

**'శతావధాని' డా॥ కడిమిళ్ళ వరప్రసాద్**

++++++++++++++++++++++++++++++++++++++++

శిలలే యార్ద్రములౌచు జీవనదులై శీఘ్రమ్ముగా పారె వె
న్నెలకున్ సౌరభమబ్బె విశ్వమున సందీపించె జ్ఞాన ద్యుతుల్
కలి నేనుండనటంచు పోదునని యుద్ఘాటించె నో సామి! యు
జ్జ్వలమౌ మీదు ప్రభాషణమ్ము వినుచున్ చాగంటి కోటేశ్వరా!

**'శతావధాని' కోట వేంకట లక్ష్మీనరసింహం**

చతురామ్నాయమధుస్రవంతి, మతిభాస్వత్కాంతి, కాలేయ చా
రుతరాహ్లాదవచః ప్రశాంతి, పరమారోగ్యప్రసాదార్ష భా
రతరామాయణసూత్రదాంతి, మనుశాస్త్రజ్ఞానవిక్రాంతి, స్వ
చ్ఛతమంబైన త్వదీయరూపముగదా! చాగంటికోటేశ్వరా!

ధారాశుద్ధ, ఉదారతాసురభిలః, శయ్యాసులక్ష్మీధరః
మాధుర్యోదయసార, ఉజ్జ్వలరసః సద్వృత్తసంశోభితః ।
సాధుః శాశ్వతకీర్తిరార్యచరితః సద్ధారణాసారసః
జీయాత్సద్గుణపద్మపూరితసరః చాగంటికోటేశ్వరః॥

**'త్రిభాషామహాసహస్రావధాని' వద్దిపర్తి పద్మాకర్**

++++++++++++++++++++++++++++++++++++++++++

పరమామ్నాయ రహస్య దివ్య గరిమా పారమ్యమున్ జాటుచున్
వరమై హైందవజాతికిన్ వెలుగు దివ్వై నిత్యమున్ నిల్చు శ్రీ
కరమై నీదగు భావపంక్తి కలిమిన్ గానమ్ము నందించుచున్
స్వరమై వెల్గెడు సాహితీశ్వర వరా! చాగంటి కోటేశ్వరా!

వ్యాసోక్త ప్రతిభా సమన్విత కళా వైదుష్య సంశోభితో
వాల్మీకేర్మునిపుంగవస్య కవితా తత్త్వాంచితో సాత్వికః ।
శ్రీమానప్పయదీక్షితాంఘ్రియుగళస్వచ్ఛార్చకః కోవిదో
జీయాద్వర్షశతం ప్రబోధకమణిః చాగంటి కోటేశ్వరః ॥

**'అష్టావధాని' డా॥ ముదిగొండ అమరనాథ శర్మ**



వివరించన్వలెనన్న నీవె భగవద్విజ్ఞానమున్ సర్వదా
ప్రవచింపన్వలెనన్న నీకు దగు ధర్మజ్ఞానసందేశముల్
రవళించం దగు నీకు దైవమహిమన్ రమ్యంబుగా భాషణన్
చవులూరం దగు నెల్ల శ్రోతలకు శ్రీ చాగంటి కోటేశ్వరా!

చెప్పం బూనినదెల్ల శ్రోతలకు వాక్శ్రీగౌరవార్హంబుగా
విప్పం జాలినదెల్ల వాల్మికి హృదావిష్కారసంస్కారమే
మెప్పుం బొందెడు నీ పురాణవచనాల్ మృష్టాన్నసౌధాంబువుల్
చప్పంగానని యన్నవాడు చవటే చాగంటి కోటేశ్వరా!

కంఠోపాఠము పోతనార్య కవితాగాంభీర్య మెన్నందగున్
కంఠాభూషణమెల్ల రామకథ చక్కన్జెప్పగా నెన్నడున్
కుంఠీభూతమనస్కు లెల్లరకు వాకోవాకు చాకుల్గదా!
శంఠుల్ పౌరుషవంతులౌదురు సదా చాగంటి కోటేశ్వరా!

యాత్రల్ సెప్పిన జూడ ముచ్చటగు వ్యాఖ్యానంబు సఖ్యంబిడున్
పాత్రల్ విప్పిన లోని  భావములు శ్రావ్యంబుల్ చిరస్థాయి లే
మాత్రంబైన నిరాశ రాదు వినిపింపన్ శాంకరీతత్త్వముల్
చైత్రంబేయగు గ్రీష్మతాపమును శ్రీ చాగంటి కోటేశ్వరా!
(శంకరుని, శాంకరిని, శంకరాచార్యులను)

తత్త్వంబున్ విడమర్చ నాస్తికులు శ్రద్ధాసక్తులన్ బొందరే?
చిత్త్వంబున్ వివరించ ధార్మికులు నచ్చెర్వందరే? లౌకికుల్
విత్తార్థంబుల గాంచి వాక్పటిమ నావిష్కారమున్ జేయరే?
సత్త్వాచార సుబోధకా! ఇతవరీ! చాగంటి కోటేశ్వరా!

**‘అష్టావధాని’ అష్టకాల నరసింహరామ శర్మ**





ఒక్కొక్కండు జనించు కారణముచే నొక్కొక్క వంశంబు పెం
పెక్కన్ పేరుగడించు, పెద్దల మనోభీష్టంబు సిద్ధించు, యే
దిక్కన్ జూచిన తానయై వెలయు కీర్తి జ్యోత్స్న, మీరొక్కరీ
చక్కిన్ హారతులందుకొందురుగదా! చాగంటి కోటేశ్వరా!

ఆవేశింతురొ ఆదిశంకరులొ ఆ వ్యాసుండొ వ్యాసాత్మజుం
డో వాగ్వైఖరి యేమి? యా వివిధ భావోద్వేగ విశ్లేషణా
ప్రావీణ్యం బదియేమి యెప్పటిదొ యీ బ్రాహ్మీమయ స్ఫూర్తి ప్ర
స్తావింపన్ ప్రణుతింప మోజుపడితిన్ చాగంటి కోటేశ్వరా!

కవికల్పాంతము నిల్చి యుండు కవితా కావ్యామృతాస్వాదన
ప్రవణుండై ప్రజకున్ నిరంతరము నిస్స్వార్థమ్ముగా కావ్యవై
భవమున్ పంచు విమర్శకాగ్రణియు, తత్పౌరాణిక శ్రేణి సు
స్తవనీయుండవు శాశ్వతుండవు గదా! చాగంటి కోటేశ్వరా!

ప్రకటార్షేయ కళామయాననముతో భస్మత్రిపుండ్రాంక ఫా
లకనత్ కమ్ర కషాయకుంకుమముతో రమ్యోత్తరీయంబుతో
వికసత్ సారసహాస నేత్రములతో విజ్ఞాన మందింతు వో
సకలామోదక వాగ్విలాస! ప్రణతుల్ చాగంటి కోటేశ్వరా!

**'శతావధాని' గండ్లూరి దత్తాత్రేయ శర్మ**

++++++++++++++++++++++++++++++++++++++++++

కమనీయం బగు వాక్సుధారసములన్ కైవల్య మార్గంబులన్
రమణీయంబుగ భక్తకోటిహృదిలో రంజింపగా నింపుచున్
శమదానంబుల భారతాది విలసత్ సారంబు పోతన్నకున్
సములై తెల్పెడు నార్య సన్నుతపథా! చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' ఆకెళ్ళ బాలభాను**

ఒకటో వందయొ వేయియో పొగడికల్ హోరెత్త నిన్నూర్చి వ్రా
యక యీ మానిసి మేని పోకడకు నీ వందించు మేల్దారిలో
నిఁక సాగంగఁ దలంతు నొజ్జకిడనౌ నేదేని కాన్కంచు దా
చక యీ పద్దెపు వ్రాలగుత్తి నిడెదన్ చాగంటి కోటేశ్వరా!

చాయన్ వెల్గెడి కల్లు(రాయి) తానగునుగా చాగల్లు చాగంటితో
నేయే తావులనైన దేవళములం దే బొమ్మలైనన్ సరే
చేయుంజేతరి యెల్లదేవరలకున్ చేకూర్చు 'చాగంటి' వా
సాయంబట్టులె నాడులెల్ల వినగా చాగంటి కోటేశ్వరా!

స్రగ్విణీవృత్తం

నమ్రతామూర్తి! జ్ఞానమ్ము మాకీయవే
తామ్రమౌ బుద్ధి చింతాకువై తోమవే
ఆమ్రశాఖాపికాహ్లాదకంఠస్వరా!
కమ్రసంచార! చాగంటి కోటేశ్వరా!

ప్రాకృతభాషాస్తుతి

అణ్ణా నత్థి తిథా గదా జలసహీ ఆద్దా ణదీ ఈదిసీ
పణ్ణాసా వణఅమ్ సుణాదు అ జణో బంధేదు విద్ధంసణమ్
ధణ్ణా తే తుహ దంసణం జహి కిదా ధమ్మస్స దివ్వమ్ హిదమ్
జణ్ణో సో సులహో హుదేణ వివిహో చాగంటి కోటేస్సర!

సంస్కృతచ్ఛాయ

అన్యా నాస్తి త్రిథా గతా జలసఖీ ఆర్ద్రా నదీ ఈదృశీ
పఞ్చాశద్వచనం శృణోతు చ జనో బధ్నాతు విధ్వంసనమ్
ధన్యాస్తే తవ దర్శనం యది కృతా ధర్మస్య దివ్యం హితమ్
యజ్ఞస్సః సులభో హుతేన వివిధః చాగణ్టి కోటేశ్వర!

**'కుదురాటగండ' పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**

శ్రీమద్భారత రామగాథ హృదయాశ్రిత్యార్ష ధర్మంబులన్
సామాద్యాగమ శిష్టమార్గ నియతిన్ సర్వప్రజానంత సం
క్షేమంబున్ మది గోరి రమ్యతర వాక్ప్రీమంత సద్భాషణల్
స్వామీ! మీరొనరించినారు గద శ్రీ చాగంటి కోటేశ్వరా!

మాయాపూర్ణ నిధాన మానసులు సంపద్గర్వదుర్వారులున్
ప్రేయోమార్గ నిరంతరాయ మతులున్ విద్యావిదూరుల్ జనుల్
శ్రేయోమార్గమునన్ జరించి వృజినశ్రేణిన్ విదారించుచున్
సాయుజ్యంబును బొందు వాక్కులిడవే చాగంటి కోటేశ్వరా!

వ్యాసప్రోక్త పురాణ శాస్త్రగత దివ్యాశేష మార్గంబులన్
కాసుల్ గోరక సర్వమానవ హితాకాంక్షన్ వచింపంగ, మీ
ధీసామర్థ్య మపూర్వ వాక్యఘటనా తేజంబు లీజాతి పూ
జా సాఫల్యములౌను నిక్కమిది శ్రీ చాగంటి కోటేశ్వరా!

విద్యాగంధము లేనివారలు, మహావిద్వాంసులున్ మేలనన్
చిద్యోగాఖిల నారికేళముల విచ్ఛేదంబు గావించి నై
వేద్యంబియ్యవె శాస్త్రభావముల నిర్వేదంబు బోనాడుచున్
సద్యఃస్ఫూర్తి రహించు వాక్యముల శ్రీ చాగంటి కోటేశ్వరా!

శుకుడో, సూతుడొ, వ్యాసశిష్యుడగునో సొంపారు వాగ్ధాటితో
నకలంకంబుగ సర్వశాస్త్రముల వ్యాఖ్యానించు సుజ్ఞాని, యీ
శకలీభూత మహార్ష సంస్కృతికి నాశారేఖయైనాడు, త
చ్ఛకమీకాలమటంచు జెప్పెదరు శ్రీ చాగంటి కోటేశ్వరా!

**'శతావధాని' ఆముదాల మురళి**



నవనీతమ్మునకున్ మృదుత్వమును సంధానించు మీ వాక్కు, మా
నవ సామాజిక మంగళ ప్రదముగా నర్తించి వర్తించెడున్,
నవకాంతుల్ ప్రసరింప జేయు మహిలో జ్ఞానప్రసూనోత్కరా!
స్తవనీయ ప్రతిభా ప్రభా! బుధవరా! చాగంటి కోటేశ్వరా!

శుకయోగీంద్రుడవో, సుధాకరుడవో, సూతుండవో, శాంకర
ప్రకటాంశుండవొ, వ్యాసమౌనివొ, మహావాల్మీకివో, భారతీ
య కళా సంస్కృతి సుప్రతీకవొ, వివేకానంద చిన్మూర్తివో?
సకలాశా పరిదీప్త వాక్సుమధురా! చాగంటి కోటేశ్వరా!

మహనీయమ్మగు నీ ముఖమ్ము గనగా మాలిన్యముల్ మాసెడున్
స్పృహణీయమ్మగు నీ మృదూక్తి వినగా చిత్తేజముల్ గల్గెడున్
వహనీయమ్మగు నీదు జ్ఞానరుచి సంభావింప నజ్ఞాన దో
ష హరంబౌ గన మాన్యపండితవరా! చాగంటి కోటేశ్వరా!

పరమానంద మరంద బిందువులు సొంపై చిందుచున్నట్లుగా
వర మాధుర్యపు కచ్ఛపీశ్రుతులు నింపై చిల్కుచున్నట్లుగా
సురగంగా సుత రంగభంగిమల వీచుల్ పొంగుచున్నట్లుగా
స్వరపేటిన్ సవరించి పల్కెడి దొరా! చాగంటి కోటేశ్వరా!

**'శతావధాని' డా. జి.యం. రామశర్మ**

✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦✦

తనుహృద్భాషల ధర్మతత్పరత, శ్రౌతంబైన సచ్ఛీలమున్,
ఘన వాగ్వైభవ మాత్మశోధనము, అక్షయ్యామృతాద్వైత త
త్త్వ నిగూఢార్థక  జ్ఞానవాహినియె మీదౌ రూపునన్ నిల్చి తత్
క్షణమే శాంతిని మాకొసంగును గదా! చాగంటి కోటేశ్వరా!

**మరుమాముల దత్తాత్రేయ శర్మ**

వరమౌ హైందవధర్మమున్ పలుకులన్ భద్రమ్ముగా నిల్పుచున్
మురళీమోహను దివ్యభాగవతమున్ ముద్దార నేర్పించుచున్
కురురాజన్యుల గాథ , రామకథ మాకున్ దెల్పి , మా బుద్ధివి
స్తరతన్ బెంచిన ధీమణీ! నతులు శ్రీ చాగంటి కోటేశ్వరా!!

లలితా విష్ణు సహస్రనామవిపులార్థంబుల్ మనోరంజక
మ్ములుగా, జ్ఞానమునిచ్చు దీపములుగా, మోహాబ్ధిదాటించు నా
వలుగా దెల్పిన మీ ప్రసంగముల నే వర్ణింపగాజాల నం
జలి గావించెద భూసురాన్వయమణీ! చాగంటి కోటేశ్వరా!!

వ్యాసప్రోక్తపురాణవాఙ్మయలసద్వైదుష్యసంపూర్ణశో
భాసౌందర్యము మూర్తిమంతమయి శ్రీ వాగ్దేవి రూపమ్మునన్
భాసిల్లెన్ ధరలోననంచు విబుధుల్ భావింపగా భక్తివి
శ్వాసమ్ముల్ రవళింప జేసితిరి శ్రీ చాగంటి కోటేశ్వరా!!

శుకుడా భాగవతమ్ము రాజున కటన్ సూక్ష్మార్థసంపత్తితో
ప్రకటింపన్ దరి జేరి వింటిరొకొ! మీ వాక్యమ్ము తద్భావమై
సుకరంబౌగతి ముక్తిమార్గమిలలో సూచించుచుండెన్! ప్రవా
చకసామ్రాజ్యరమాపతీ! గుణనిధీ! చాగంటి కోటేశ్వరా!!

కుహనాలౌకికవాదశక్తులు కుయుక్తుల్ పన్ని వాక్యాల సూ
క్ష్మహితార్థమ్ముల నీర్ష్యతో గని విమర్శల్ సేయ త్వద్వాగ్ఝరిన్,
బహుధా వారికి నచ్చచెప్పుటకునై "మన్నింపుమా"! యన్న మీ
సహనమ్మే సకలార్థసాధకము శ్రీ చాగంటి కోటేశ్వరా!!

**'అష్టావధాని' మైలవరపు మురళీకృష్ణ**



ధ్యానాత్మా! కనుమూసినన్ దెరచినన్ తాదాత్మ్య భావమ్మునన్
వాణీమూర్తుల సత్కృతుల్ దెలుపు మీ వాగ్ధార ప్రత్యక్షమౌ
మీ నాల్కన్ నటియించు వాణి, శివమే మీ రూపమో సద్గురూ!
జ్ఞానాబ్జామృత పాన! నా నతులివే! చాగంటి కోటీశ్వరా!

**'శతావధాని' మద్దూరి రామమూర్తి**

++++++++++++++++++++++++++++++++++++++++++++++++

శతధా నిన్ను దలంచుకోవలె పురాసారస్వతవ్యాఖ్యలన్
శ్రుతిపూర్వానుసరత్ప్రవాచనవిధిన్ సొంపైన నీ ధారలో
సతతంబీ ధర ధర్మమార్గరతయై సాగన్ సముత్సాహితన్
చతురాభాషణభూషణా! తలతు నిన్ చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' డా॥ అయాచితం నటేశ్వరశర్మ**

++++++++++++++++++++++++++++++++++++++++++++++++

వాచస్పత్యనురూపభావకలనావాగ్వేగవిద్యాధరా!
ప్రాచీనోక్తపురాణకావ్యవిలసద్భక్తిప్రబోధాకరా!
రోచిఃపూతశుభైకమానస వినిర్ముక్తాత్మతత్త్వస్థిరా!
సాచివ్యప్రతిభాత్తదేశికవరా! చాగంటికోటేశ్వరా!

**'శతావధాని' డా॥ రాంభట్ల పార్వతీశ్వర శర్మ**

++++++++++++++++++++++++++++++++++++++++++++++++

కమనీయోజ్జ్వల కావ్యపాఠవిలసత్కళ్యాణసంధాయకా!
రమణీయామరసాహితీవిమలతీర్థస్నాతప్రఖ్యాత! యు
త్తమసంస్కారము రూపుగొన్న సుమతీ! ధన్యా! సుశైవాకృతీ!
సమతాభావసుగాంగతోయసుకృతీ! చాగంటికోటేశ్వరా!

**'అష్టావధాని' ముత్యంపేట గౌరీశంకరశర్మ**

హృద్రాజీవ నిషణ్ణ సూక్ష్మ పరమప్రజ్ఞాన చైతన్య గో
రాజేంద్రోపమ! వేదమంత్ర రస సంశ్రీవాట్ సుపర్ణోపమ!
మర్యాదా పురుషోత్తమాయన మనః కోదండ నిర్ముక్త స
ద్ధర్మోపాసక! సద్గురో! విజయసే చాగంటి కోటేశ్వర!

**'ఉభయభాషావధాని' పాలడుగు శ్రీచరణ్**

\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+

మరలన్ మాదృశబాలకుండు నుతియింపన్ మీకునెంతౌను? స
చ్చిరవేదాంతులు శారదాకృతులునౌ శృంగాద్రిపీఠాధిపుల్
మరి పొంగన్ భవదీయనిష్ఠఁ గని శ్రీమద్భారతీతీర్థులే
సరణిన్ మిమ్ము ప్రశంససేసిరి కదా చాగంటికోటేశ్వరా!

**'శతావధాని' గన్నవరం లలితాదిత్య**

\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+

అరవిందాసన సత్కృపాజలధిలో నశ్రాంతమున్ మున్గుచున్
ధరణీఖండమునన్ ఘనప్రవచనాధారాంబువుల్ చిల్కుచున్
నిరతంబున్ నశియింప జేసితివి యన్నెంబున్ యథాశక్తి, యీ
శ్వరపాదాంబురుహార్చకా! బుధవరా! చాగంటికోటేశ్వరా!

ధీరోదాత్తగుణోత్తమా! ఉపనిషద్విజ్ఞానతేజోమయా!
పారావార సమర్థవాఙ్మయకళాపారీణ! విప్రోత్తమా!
కారాగారనిబద్ధ వైదికసమజ్ఞా బంధనిర్మోచకా!
సారాచారవిచార రక్షణపరా! చాగంటికోటేశ్వరా!

స్రగ్విణి. దానధర్మాది విద్యావివేకమ్ములన్
మానమర్యాద సంబంధవిజ్ఞానమున్
దేనినైనన్ ప్రబోధింపగా మేటివే
జ్ఞానవారాశి! చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' నేమాని సోమయాజులు**



వరపౌరాణిక గాథలంగొని లసద్వ్యాఖ్యానముల్జేసి యు,
ర్వర సూరుల్ మరి పామరుల్ వినియు వహ్వాయంచు వాక్రుచ్చి బం
ధురమార్గమ్ముల స్వీయధర్మముల నెంతో నిష్ఠ పాటించుచున్,
చరియింపన్మది  మోదవార్ధి మునిగెన్ చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' ముద్దు రాజయ్య**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

వరమై నిల్చెను ధర్మవాఙ్మయము మీ వాఙ్మాధురిన్ నిత్యమై,
స్వరమై నిల్చెను శారదా కరుణ విశ్వశ్రేయమై సత్యమై,
స్థిరమై నిల్చెను హైందవమ్మునకు మీ శ్రీభాష్యమే వేదమై,
సరమై నిల్చితివయ్య భారతికి, శ్రీ చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' సురభి శంకరశర్మ**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

శ్రీదేవీ హృదయాబ్జ భృంగమగు నా శ్రీవిష్ణుదేవుండు, ఋ
గ్వేదాదుల్ పఠియింప లేని ప్రజకున్ బ్రీతిన్ బ్రబోధింపఁగా,
మోదంబున్ మిము బృథ్విపైఁ గొలిపెనో! పూర్ణ ప్రభన్ వెల్గు ధీ
శా! దివ్యామృత వాక్ప్రకాశ విభవా! చాగంటి కోటేశ్వరా!

దత్తాత్రేయు హృదబ్జమే తమరొ? బోధన్ గల్గి సర్వంసహా
యత్తంబైన ప్రసిద్ధ బోధనములత్యంతంబు భాసింపఁగా
నుత్తేజంబున చేయనేర్చితిరి, మీ యుచ్ఛ్వాస నిశ్వాసలన్
సత్తత్వంబె వెలుంగుచుండును కదా! చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' చింతా రామకృష్ణారావు**





మన యాచారము, సంప్రదాయమును, ధర్మంబున్, కుటుంబానుబం
ధనసుశ్రీ, మహనీయ వాఙ్మయ మబుద్ధప్రాయమై, మృగ్య పా
వన వృత్తంబగు నేఁడు తద్విభవ లాభప్రాపణార్థంబు వా
గ్జనయిత్రీకృప నుద్యమించెదవు శ్రీ చాగంటి కోటేశ్వరా!

ఒక దివ్యానుభవప్రచోదనముగా, నున్నీత వాచా విపం
చిక మ్రోగింతువు, గోపికానికరమా శ్రీకృష్ణ వేణుస్వనో
త్సుకమై చేష్టలుడింగినట్టులు జనస్తోమంబు సక్తశ్రవ
స్సకలాంగంబగుచున్ వినంగ నిల శ్రీ చాగంటి కోటేశ్వరా!

వేదాద్యధ్యయనక్రమోజ్జ్వలగళస్ఫీతస్వరోద్యత్సుధా
మాధుర్యమ్మున శ్రావకుల్ పరవశింపంగన్, పురాణేతిహా
సాదుల్ వెల్వడు మీ ముఖాబ్జమున వాగంబా మహాదర్శనా
స్వాదం బయ్యెడు నాగమానుగమనా! చాగంటి కోటేశ్వరా!

గురుసాహస్రము పెక్కు వత్సరములన్ గూలంకషప్రజ్ఞ ను
ర్వర కందింపఁగ లేని ధార్మిక విచారస్నిగ్ధ చేతమ్ము, నీ
శ్వర పూజాపరవర్తనాదికము నీషత్కాలమందున్ గిరా
ఝరివై యందఁగఁ జేసితో గురువరా! చాగంటి కోటేశ్వరా!

భవదుక్తాంశమహార్థ మందకయె గ్రీవారావకల్లోలినీ
ప్రవణత్వమ్మున స్వస్థచిత్తు లగుచున్ వైయక్తిక వ్యాపృతిన్
భువిలో నెందఱొ కానవత్తురు వచఃపుంజాకృతిన్ గీతికో
త్సవమున్ జేయుదువో బుధాగ్రసర! శ్రీ చాగంటి కోటేశ్వరా!

**‘అష్టావధాని’ డా॥ అబ్బిరెడ్డి పేరయ్య నాయుడు**

భ్రుకుటీమాత్ర విలాస హేలనముచే మోక్షంబు కల్పింపగా
ప్రకటామోద తరంగితాత్మయగు నా వాగ్దేవి హర్షింప నీ
శుకవాణీకలితప్రసంగములతో శోభిల్లు వాగ్ధారలన్
సకలాంధ్రావళి మోదమున్ బొరయు నో చాగంటి కోటేశ్వరా!

స్మరణీయాద్భుత భక్తితోడ పరమాచార్యాంఘ్రి సేవార్థివై
వరదానాద్భుత నిర్ఝరీ సరళియౌ వాగ్ధారలోహో సదా
పరమాహ్లాదకరంబులౌను భళిరా! ప్రాసంగికార్థమ్ములన్
చరితార్థంబగు నీదు జీవనమె యో చాగంటి కోటేశ్వరా!

కలయో వైష్ణవ మాయయో యనగ శ్లోకార్థంబు గంభీరమై
తెలుగుం బద్యములెల్ల చెప్పెదవు, నీ ధీశక్తి శోభింపగా
భళిరా! సత్కవివౌదు నీవనుచు నా వాగ్దేవి దీవింపగా
చలమేలా యని బ్రహ్మయున్ పొగడునో చాగంటి కోటేశ్వరా!

అవధానంబని యాశుధారయని యభ్యాసంబు గావింతు రం
దవధుల్ ధారణ ధోరణీ సహిత సద్యఃస్ఫూర్తులౌ, సంస్క్రియా
సవనార్థం బుదయించినట్టి ఘనుడా! శాస్త్రార్థ గంభీరతల్
చవులూరంగను విప్పి చెప్పెదవుగా చాగంటి కోటేశ్వరా!

ఒక శ్రీనాథుడు పోతనార్యుడును నీ యూహాప్రపంచంబునన్
చకితానంద సహర్ష దీధితులతో సాకారులై నిల్వగా
ప్రకటామోదముతోడ వ్యాసుడును నీ వాగ్ధారలన్ పెంచగా
సకలాంధ్రావని కేలు మోడ్చెడిని శ్రీ చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' డా॥ రేవూరు అనంతపద్మనాభ రావు**

ధారావాహిక వాగ్వికాసమయమై ధన్యత్వ సద్బోధయై
పారావార ససూక్తి మౌక్తిక కళా పౌరాణికప్రక్రియా
భూరిప్రాభవ భక్తి బోధనములన్ భూషించి భాషించ స
త్సారల్యంబిడు చక్రవర్తి జయహో చాగంటి కోటేశ్వరా!

నీ వాచాలత మంత్రపూతమయమై నిత్యోత్సవానందమై
భావప్రౌఢ హితోక్తులై సభల సభ్యశ్రేణి లెక్కించ సం
జీవౌచిత్య ప్రసంగ సంగతి లసత్ శ్రీరాగముల్ జిల్కు దీ
క్షా వాచంయమి చక్రవర్తి జయహో చాగంటి కోటేశ్వరా!

రసనాగ్రమ్మున సద్వచోమధురిమల్ రంగారు భక్తిత్వమై
పస చూపించుచు పాండితీ ప్రతిభతో భక్తిప్రభావమ్ము సం
తస ముప్పొంగ ప్రసంగముల్ సలుపు విద్వద్భావసంపత్తి స్వే
చ్ఛ సమౌచిత్యపు చక్రవర్తి జయహో చాగంటి కోటేశ్వరా!

కరుణాపూరిత వాక్ప్రసూనముల సంకల్పప్రసన్నత్వమై
స్థిరభావమ్ముల నింపి సత్సభను రాజిల్లన్ ప్రశంసాకృతిన్
దరహాసామృత సత్కథల్ వరలగా ధర్మప్రబోధాత్మ సు
స్వరముల్ మీటిన చక్రవర్తి జయహో చాగంటి కోటేశ్వరా!

పలుకుల్ ముత్యపు చిప్పలై వరలు భావప్రౌఢి నుప్పొంగ సూ
క్తుల సౌరభ్యము సభ్య సంస్కృతులతో క్రోడీకరింపన్ సభన్
భళి సభ్యాలి ప్రశంస చేయగను భవ్యంబైన భక్తిత్వమై
సలుపన్ జాలిన చక్రవర్తి జయహో చాగంటి కోటేశ్వరా!

'అష్టావధాని' డా॥ గౌరీభట్ల రఘురామ శర్మ



ధరపైనెవ్వరు భారతాంబ సుతుడై ధన్యత్వముంబొందె? తా,
స్థిరమౌ భక్తిని వేదమాత గొలిచెన్, చిద్రూప సంధాతయై,
పరమామ్నాయము దివ్యదీప్తులొలుకన్ పాండిత్య సన్మూర్తియౌ
సరి మీకెవ్వరు నేటికాలమున? శ్రీ చాగంటికోటేశ్వరా!

**'అష్టావధాని' అవుసుల భానుప్రకాశ్**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

సవ్యంబైన సమాజ రీతి గతినే సాధించునాకాంక్షతో
దివ్యత్వంబగు దృక్పథంబు జనులన్ దీవించి దీపించగా
నవ్యత్వంబును గల్పి ధార్మిక కథల్ నైరాశ్యమున్ ద్రుంచగా
శ్రావ్యంబౌగతి చెప్పు చుందురు గదా చాగంటి కోటేశ్వరా!

**'అష్టావధాని' చేపూరి శ్రీరామ్**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

శ్రీరమ్యంబగు నాంధ్రభూతలము గర్వింపంగ శేషుండవై
సారభ్రాజిత వాక్సుధాకరుడవై సత్యాధ్వనిర్ణేతవై
మీరందించెడి ధర్మసూక్ష్మరవముల్ మిన్నేటి ధారార్భటుల్
సారోదార వివేక కర్ణహితముల్ చాగంటి కోటేశ్వరా!

**డా॥ అమళ్ళదిన్నె వేంకటరమణప్రసాద్**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

అకళంకప్రతిభా పురాణ చయ సద్యఃస్ఫూర్తి వాగ్ధారతో
సకలాసక్త జనానుమోదమును శశ్వత్కీర్తినిం గొంటివే!
ప్రకటంబౌచు సనాతన ద్యుతులు ప్రాప్తంబయ్యె శిష్యాళికిన్
చకితుండైతిఁ గనంగ నీదు ప్రతిభన్ చాగంటి కోటేశ్వరా!

**కంది శంకరయ్య**





వరమై, భారతభాగ్యమై, శుభసుధావాగ్యజ్ఞసంచారివై,
హరినామామృతకీర్తనాంబునిధివై, యద్వైత సిద్ధాంతివై,
స్వరమామ్నాయము రక్ష సేయు సరళిన్ సాగించి యోగస్థితిన్
చరితన్ సంస్కృతి బాట త్రిప్పితివహో చాగంటి కోటేశ్వరా!

సౌందర్యామృత దివ్య భాగవత విశ్వశ్రేయ పద్యాబ్ధి నా
నందం బొప్పగ నీది యా దరికి జ్ఞానబ్రహ్మ తేజస్వివై
స్పందద్భవ్య రసానుభూతి ప్రజకున్ వ్యాఖ్యానమున్ జేయు బల్
సందర్భోచిత సత్యవాక్యనిపుణా! చాగంటి కోటేశ్వరా!

స్వగ్విణి. పంట పండించుచున్ వ్యాసకేదారమున్
గంటవై మ్రోగుచున్ జ్ఞానసద్వేదికన్
మంటికిన్ మింటికిన్ మాధురిన్ నింపగన్
కంటి, నే వింటి, చాగంటి కోటేశ్వరా!

స్రగ్విణి. నేను లేనట్టులౌ నిన్ను విన్నప్పుడున్
నేనె యన్నింటినిన్ నేర్చుకున్నట్టులౌ
నేను పైవానితో నేకమైనట్టులౌ
కానుకై కైకి చాగంటి కోటేశ్వరా!

స్రగ్విణి. ధారణారూపిణం ధర్మసమ్మోహనం
సంస్కృతాంధ్రాంబుధిం శాస్త్రసంశోభితమ్ ।
సర్వదా శారదాతత్వ సద్బోధకం
జ్ఞానదం నౌమి చాగంటి కోటేశ్వరమ్ ॥

**జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు**



శ్రీరామాయణభారతాదిక జగచ్ఛ్రేష్ఠేతిహాసంబులన్
ధారావాహినులౌ పురాణచయగాథల్ సర్వలోకావనా
ధారామ్నాయచతుష్కవేది నవవేదవ్యాస విఖ్యాతి ద
త్సారంబున్వెలయించు సద్గురువరా! చాగంటి కోటేశ్వరా!

ప్రాతస్సంధ్యగతించి బాలరవిబింబంబెక్క బూర్వాద్రిపై
వ్రేతల్వేణువునాలకింప హరికై వీక్షించు చందంబుగా
శ్రోతల్భారత దూరదర్శినులలో జూతుర్ శ్రవఃపేయమై
చైతన్యంబిడు త్వద్వచస్సుధలకై చాగంటి కోటేశ్వరా!

శ్రీమాతాకరుణాకటాక్షజనితాశేషాద్భుతజ్ఞానమో?
ధీమాన్యోత్తమసాధుసత్పురుష భూదేవామరాశీస్సులో?
యేమా వాక్సుధలాస్యరంగమది బ్రాహ్మీనర్తనాగారమా?
సామాన్యోన్నతమాన్యపండితనుతా! చాగంటి కోటేశ్వరా!

ధనమాశింపక మాతృవాక్యమదివేదంబౌచు శాసింప ని
ర్ధనులాసక్తులు శ్రామికుల్ ప్రవచనాలాలింపగాగోరినం
జని వాగ్దేవిప్రసాదమందుకొనవే సద్భాషణాప్తిన్ జగ
జ్జననీకారుణికత్వలబ్ధవిభవా! చాగంటి కోటేశ్వరా!

క్షణికంబే యిహలోకభోగములు త్యాగంబే హితంబంచు గ
ర్హణముంజేసి దురంతమోహము బ్రవాహంబట్టులధ్యాత్మభా
షణముల్సాగగ బూర్వహైందవ మహా సంస్కారసద్ధర్మర
క్షణకై బుట్టిన యే ఋషీశ్వరుడవో చాగంటి కోటేశ్వరా!

**చంద్రమౌళి రామారావు**

సుమలావణ్య వచస్సుగంధము ధ్వనించున్ దక్షిణావర్తశం
ఖము, సద్భక్తి మనఃపవిత్రకృత గంగావాగ్ఝరీధార, త
ద్ధిమిధిమ్మోయన పద్యతాండవము రక్తిన్ జూపు లాస్యమ్మహో
సముదంబైన త్వదీయ బోధన సుధీ! చాగంటి కోటేశ్వరా!

ద్వేషంబింతయు లేని భాషణము సద్విద్యాప్త వాక్శుద్ధి సం
తోషస్వాంత పురాణ కావ్య కథనోద్యోగంబు, ప్రాశస్త్య ని
ర్దోషావర్తన సౌమ్యజీవనము, సారోత్తంసధారాళ భా
షాషడ్జస్వర భవ్య రమ్యగళమా! చాగంటి కోటేశ్వరా!

ధీమంతుల్ తలయూచి భేషనిరిపో దిగ్దేవతల్ మెచ్చిరో
హో! మంజుప్రసవాభిరామఫణితుల్ యుష్మద్గళాంచద్రుచుల్
సామంజస్యము జూపి చెప్పు కథలున్ సామాన్యులున్ గ్రోలరే
సామాన్యుండవె? సూతధీమణివయా! చాగంటి కోటీశ్వరా!

శివదాక్షిణ్యము పల్కుచున్ కరుణతో శ్రీరాము వీరమ్ములన్
నవవాగంబక సుధ్యుపాస్యగరిమన్ నందాంగనా డింభక
స్తవనంబైన శుకర్షి వాక్పటిమతో ధన్యాత్ములం జేయుచున్
సవనంబట్టుల నిర్వహించు ప్రవరా! చాగంటికోటేశ్వరా!

శ్రీరామాయణమన్నచో తనువునన్ చిత్తమ్మునన్భక్తి, వా
గ్ధారామోహన కావ్య భాష్య ఫణితుల్ దాంపత్యవైశిష్ట్యముల్
శ్రీ రామానుజ, రామచంద్ర, భరత ప్రేమస్వరూపమ్ములన్
సారస్వాదురుచిన్ వచింతు వనఘా! చాగంటి కోటేశ్వరా!

**డా॥ వఙ్జల రంగాచార్య**



శ్రీమద్భాగవతమ్ము పోతన రచించెన్ మూలమున్ మించగా
ఆ మందార కవిత్వ మాధురు లనన్యంబుల్ సమీక్షింపగా;
ఆ మాధుర్యము నిన్మడించు భవదీయానర్గళాఖ్యాన ధీ
సామర్థ్యమ్ము ననన్యసాధ్యమయ! చాగంటి కోటేశ్వరా!

తన జిహ్వాగ్రమునందు నిల్చు నిజవిద్యారాజ్ఞి యీమధ్య నెం
దును కన్పింపమి, బ్రహ్మ లోకములయందున్ శోధనల్ సల్పి, భూ
జనలోకమ్మున సంచరింప కనియెన్ చక్కంగ నీనాల్కపై;
చన బ్రహ్మత్వము నీదటంచనెద నేన్ చాగంటి కోటేశ్వరా!

చిరుజల్లై సెలయేరులై ఘననదీశ్రీపద్యమై పాటి సా
గరతీర మ్మొరయంగ నాకసము తాకంజాలు స్వర్గంగయౌ
కెరటమ్ముల్ భవదీయవాగ్విచలితక్రీడాస్థలుల్; త్వత్సభా
సరసిన్ తామరసంబు లయ్యెదరుగా చాగంటి కోటేశ్వరా!

ఒకసూర్యుండు సమస్తజీవులకు తానొక్కొక్కడైయుండు పో
లిక గాకుండ, నితండొకేవిధముగా ప్రేమాస్పదుండంచునున్
ప్రకటింపంగల భక్తులీ భువిని నిన్ భావింతు రాత్మీయతన్
సకలాధ్యాత్మిక శేముషీ శిఖర! శ్రీ చాగంటి కోటేశ్వరా!

**పువ్వాడ తిక్కన సోమయాజి**

++++++++++++++++++++++++++++++++++++++++

ఎవరయ్యా ప్రతి నీకు? బల్కులను దాతృత్వంబు చిందాడు మా
ధవ గౌరీధవ పాదపద్మ విలసద్ధ్యానైక నిష్ఠాత్ముడా!
నవనీతాద్భుతనవ్యభావకలనా నాట్యుండ! దివ్యాత్ముడా!
ఛవిమత్కీర్తి ధురీణ! సద్గురువరా! చాగంటి కోటీశ్వరా!

**డా॥ జంధ్యాల జయకృష్ణ బాపూజీ**





కర్తవ్యంబతిముఖ్యమన్న పలుకుల్ గాఢంబుగా నమ్మి నీ
వార్తాలాపములందు నింప జనులున్ వాత్సల్యమేపారగా
వర్తింపంగ సుబుద్ధి పర్వ శ్రవణ వ్యాపార పారీణులై
స్మార్తాచార విశుద్ధులౌదురు గదా చాగంటి కోటేశ్వరా!

ఆరోగ్యస్థితి రక్షణంబునకు వైద్యంబుండు గానీ శరీ
రారోగ్యంబును మానస ప్రకృతికత్వారోగ్యమున్ గూడ నిం
డారన్ గాంచుదు రెవ్వరేని యిహసౌఖ్యాముష్మికానంద సం
చారంబందు సుఖింప బల్కెదవుగా చాగంటి కోటేశ్వరా!

మదిలో నిండిన మాటయే ప్రవచనంబై రూపు దాల్చంగ నీ
హృదయంబే భగవన్నిధానముగ సాహిత్య ప్రపుష్టంబుగా
నిది సద్వర్తనమౌ నిషిద్ధ మిదియం చీరీతి వాగ్ధాటితో
సదసత్సార విచార మిచ్చెదవుగా చాగంటి కోటేశ్వరా!

సిద్ధిన్ బుద్ధిని గల్గ జేయుచు పదశ్రీ నిండ కంఠంబులో
సద్ధర్మ ప్రతిపాదక ప్రవచన స్వారస్య మింపారగా
శుద్ధాచార వినిర్మలాత్మకులుగా శోభిల్లగా శ్రోతలో
శ్రద్ధాసక్తుల గల్గ జేసెదవుగా చాగంటి కోటేశ్వరా!

సామాన్య ప్రతిపత్తి గల్గు పలుకుల్ స్పష్టంబుగా గూర్చి నీ
ధీమాన్యత్వముతో పురాణముల సంధింపంగ జేయన్ సదా
యా మాటల్ శ్రవణంబులన్ నిలిపి బ్రహ్మానందమున్ బారవ
శ్యామోదంబుల నింపవే జనులలో చాగంటి కోటేశ్వరా!

**జంధ్యాల సుబ్బలక్ష్మి**

శ్రీమద్భాగవాది కావ్యముల విశ్లేషించి వాగ్రూపితా
ధీమన్ గూర్చుచు ధర్మసూక్ష్మముల సందేహాలు పోగొట్టుచున్
సీమాంతంబుల పేరు గాంచితివయా జేకొట్ట గోదా నివా
సా! మా భాగ్యము కాకినాడ పురికిన్ చాగంటి కోటేశ్వరా!

సన్మార్గంబిడు మీదు మాట నియతిన్ సత్యోక్తి శోభావళీ
సన్మిత్రాళికి వేది యౌను సతమున్ సంతోష వైభోగముల్
హృన్మాధుర్యము రంగరించు పితరుల్ తృప్తిన్ ప్రమోదించు త్వత్
సన్మానంబు నొనర్తురయ్య సుమతీ! చాగంటి కోటేశ్వరా!

విజ్ఞానంబును గూర్చు త్రోవ ప్రభలన్ వేదార్థసారాంశముల్
జిజ్ఞాసల్ విడురీతి తెల్పు సభలన్ చెయ్యెత్తి జేకొట్టగా
ప్రజ్ఞాశీలురు మిమ్ము చేర బిరుదుల్ వాగ్దేవి నర్పించగా
సజ్ఞానావని చక్రవర్తి తమరే చాగంటి కోటేశ్వరా!

చాగంటీ! మిము గంటిమయ్య వినగా ఝుంకారమౌ బోధనల్
జేగంటల్ భరతావనిన్ సుయశమున్ జేజేలు  మిన్నంట వై
భోగాంచత్ ప్రసుశీల సుందరులు సమ్మోదంపుటాశీస్సులన్
సాగంగా కురిపింప జేసిరి గదా చాగంటి కోటేశ్వరా!

**నిడసనమెట్ల శేషగిరిరావు**

++++++++++++++++++++++++++++++++++++++++

శ్రీవిద్యా సుమగంధ బంధుర పదాంచిత్ప్రాభవోన్మేషితా
శ్రీవాణీపద సేవనాభ్యుచిత సంశ్రేయాంచితా రాజితా
శ్రీవిద్వత్ప్రభవానుగమ్య జనతా సేవా సునామాంకితా
సౌవిద్యాంశుక వాగ్విభూషణచణా! చాగంటి కోటేశ్వరా

**తోపెల్ల బాలసుబ్రహ్మణ్య శర్మ**





శ్రీ వాల్మీకివొ? బాదరాయణ మునిశ్రేష్ఠుండవో? కాక వా
గ్దేవీమూర్తివొ? భాష్యకారుడవొ? భోగిశ్రేష్ఠ ప్రజ్ఞానిధీ
భావాతీత వచోవిశేషలతికల్ ప్రాకెన్ దిగంతాల, భా
షావాచస్పతి! కోటి కోటి ప్రణతుల్ చాగంటి కోటేశ్వరా!

మీ రామాయణ వాక్సుధా జలధులున్, మీ భారతాఖ్యానముల్
మీ రమ్యాద్భుత వాక్య దివ్య సరితల్, మీ శాస్త్ర పాండిత్యముల్
ధారాపాత సుధాభిషేకములు భద్రాద్రీశుకున్ నిత్యమున్
సారోదార మహాపురాణ జలధీ! చాగంటి కోటేశ్వరా!

దెసలన్ జిందెడి బ్రహ్మతేజమున సందీపించుచున్ నిత్యమున్
రసనన్ భారతి కచ్ఛపి ధ్వనుల సారప్రజ్ఞతో దెల్పుచున్
రసభావమ్ముల జ్ఞానదానములతో రంజింపగా జేయ రా
క్షసభావమ్ములు పోయి శాంతి యలరున్ చాగంటి కోటేశ్వరా!

**'అభినవ మొల్ల' డా॥ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ**

++++++++++++++++++++++++++++++++++++++++

మీ వాగ్ధాటికి చిన్నబోయి యిరుకౌ మిన్నేరు, మీకీర్తియున్
ద్యావాపృథ్వ్యవకాశ పేశలము, నీహారమ్ము చేతమ్ము, మీ
దౌ వాత్సల్యము వార్ధియంత, కననౌద్ధత్యమ్ము లేశమ్ము, హం
సా! వర్ధిల్లును గాక బోధనములుం జాగంటి కోటేశ్వరా!

నవ్యత్వాన రహిల్లు బోధనలు, హైన్దవ్యంబు దీపించు, సు
శ్రావ్యంబైనగళమ్ము, మేరువు గదా సత్కావ్యమర్మాల సం
భావ్యంబౌ కఠినాత్ముడున్ వినగ నిర్వాణమ్ము, మీవాక్కులున్
సవ్యంబైన పథాన మమ్ము నడపుం జాగంటి కోటేశ్వరా!

**ఎన్.సిహెచ్. చక్రవర్తి**



నీ సూక్తుల్ కదు స్ఫూర్తిదాయకము వాణీపుత్ర! మాకెన్నడున్
నీ సమ్మోహనగాత్రవైభవము బంధించున్ మహాయోగమై
ధీ సామాన్యజనావళిన్ పరమభక్తిన్ నింపి కర్ణమ్ములన్
శ్వాసన్ వృద్ధినొనర్చు సత్సభలు శ్రీ చాగంటి కోటేశ్వరా!

ఘనమౌ మీ సుగుణ స్వభావమును సత్కార్య ప్రవృత్తిన్ సనా
తన ధర్మాచరణోద్యమస్ఫురణనున్, తత్వార్థ విశ్లేషణల్
మునకల్ వేయుచు జ్ఞానవారిధిని, సంపూర్ణత్వమున్ బొందుచున్
జనసామాన్యము ప్రస్తుతించు మిము శ్రీ చాగంటి కోటేశ్వరా !

వరియించున్ విజయమ్ము మీ మృదు వచో వాత్సల్య భావంబునన్
పరిపుష్టిన్ కలిగించు డెందమునకున్ భావార్థ సాహిత్యముల్
స్ఫురియించున్ ఘనమైన ధ్యేయములు పెంపొందించ జ్ఞానావృతిన్
సరిచేయున్ మదిలోని దుర్ వ్యధలు శ్రీ చాగంటి కోటేశ్వరా!

దైవారాధన జీవి పుట్టుకకు సార్థక్యమ్ము చేకూర్చు, శ్రీ
కైవల్యమ్ము లభింప కోరుకొనుటన్ కర్తవ్య దీక్షార్థికిన్
త్రోవల్ చూపిరి, స్ఫూర్తిమంతమగు సూక్తుల్ నేర్పిరాచార్య! మీ
సావాసమ్మతి దుర్లభమ్మగు గదా చాగంటి కోటేశ్వరా!

కలికాలంబిది స్వార్థ బంధముల సౌఖ్యాంభోనిధిన్ దేలగా
కలకాలమ్ము నరుండు కోరుకొను, దీక్షన్ గొల్వడేదేవతన్
మలచంగన్ మది భక్తి మార్గమున మీ మాటల్ ప్రసంగమ్ములు
జ్వలమౌ శక్తి నొసంగు మర్త్యులకు శ్రీ చాగంటి కోటేశ్వరా !

**కందాళ వెంకట్ మోహన్ రావు**

శ్రీ కైవల్యద పూర్వపుస్తక లసచ్ఛ్రీసార సర్వస్వమున్
సోకుంగూర్చెదు తీయతేనియ రుచిం శోభిల్లు వాగ్గంగతో
నాకర్ణించెడువారి నెమ్మదిని పుణ్యాహ్లాదముల్ పొంగగా
క్ష్మాకందించు  సరస్వతీపురుష శ్రీ చాగంటి కోటేశ్వరా!

విద్వాంసుండు ప్రపంచమంతటను సప్రేమాభిషేకమ్ములన్
సద్వీథిన్ గొనునన్న వాక్కునకు పెన్ సాక్ష్యమ్ముగా పొల్చుచున్
సద్వైదుష్యముతోడ సద్విషయముల్ స్వాంతమ్ములన్ జేర్చెదున్
సద్వాక్యామృతధార కాకృతివె  శ్రీ చాగంటి కోటేశ్వరా!

ఒకగంగా రమణీయ వాక్యఝరి స్వర్వ్యాహృత్త సంధానియై
మకిలింబట్టిన భారతీయ వరధర్మజ్ఞాన తేజంబునే
సకిరీటంబుగ పొల్చుచుండునటు ప్రక్షాళించు సద్రీతిలో
సకలాశల్ వినెడున్ ప్రసంగఝరి శ్రీ చాగంటి కోటేశ్వరా!

ఘన మాధ్యాత్మిక సంపదన్ మహిని నాకస్థానమన్ కీర్తితో
మనునీ భారతభూమి పశ్చిమదిశన్ భాసించు నర్థార్జనా
వన సమ్మోహన ధావనంబుకొఱకే  శ్వాసించుటల్ మాన్పగా
జను బోధల్ సలుపన్ వచోనిధివె శ్రీ చాగంటి కోటేశ్వరా!

బుధులున్ బోధకు నోచనట్టి పలుసమ్మోహాపహార్యంబులౌ
విధి సంబోధిత ఆప్తవాక్యముల హృద్వీధిం బ్రజం జేర్చి స
త్సుధగ్రోలుండని  స్వీయవాక్యఝరి సంశోభింపగా జేసి ని
శ్లథమౌ  వేణురవంబు ప్రీతినిడు శ్రీ చాగంటి కోటేశ్వరా!

**రాయప్రోలు  సీతారామశర్మ**



మిము దర్శింపఁగ లేక యింతవరకున్ మీ బోధలన్ వింటి; నే
మమకారమ్మును లేని నాకొక రసోన్మత్తస్థితిన్ నిల్పినా
వమరన్ భక్తిని; ఆదిశంకరుడవో, అయ్యంబికేశుండవో
సమతన్ మమ్ములఁ దీర్చి దిద్దితివిగా చాగంటి కోటేశ్వరా!

చాగంట్యన్వయ దుగ్ధవార్ధి శశి! నిచ్చల్ నీదు బోధామృత
శ్రీ గంగాఝరి మున్కలాడితి, నటుల్ ప్రేరేచఁగా, 'బుద్ధి' చే
కో గంటిన్ బుధమండలి ప్రణుత! చిక్కుల్ వీడె "మాం పాహి" యం
చాగామ్యర్థ మెఱుంగఁ జేయుమిక మా చాగంటి కోటేశ్వరా!

శ్రుతులున్ శాస్త్ర పురాణముల్ సదువుచున్ సుశ్రౌత మార్గమ్మునన్
వ్రతముల్ పూజలు నిష్ఠగా సలుపుచున్ స్వర్ణాది దానాలతో
హితమౌ యాత్రలఁ జేసినన్ నిజముగానే తత్ఫలం బంతయున్
సతమున్ మీరలు సేయు బోధ కెనయే? చాగంటి కోటేశ్వరా!

హాయిం గూర్చు విపంచికా మృదుల శబ్దానందదమ్మై, శ్రవః
పేయ స్వాదు నభోనదీ లహరికా ప్రేంఖన్నినాదంబు, నా
ప్యాయమ్మైన ప్రసాదమైనయది దేవా! మీ యుపన్యాస వా
క్ఛాయన్ ధన్యులమైతిమయ్య గురురాట్చాగంటి కోటేశ్వరా!

పలుకుం దొయ్యలి మీదు నాల్కపయి నావాసమ్ముఁ దాఁ జేసె మీ
పలుకుం దళ్కుల కారణ మ్మదియబో స్వామీ! కనన్ కప్రపుం
బలుకుల్ చల్లిన రీతి, విన్న సుభగంబై యొప్పు మీ బోధనాం
శలు నొప్పారెడు; మీకు సాటి గలరా? చాగంటి కోటేశ్వరా!

**కోగంటి వేంకటాచార్యులు**

శ్రీమద్వేంకట నాయకుండు జగతీక్షేమంకరుం డబ్జ భూ
కామారీంద్ర గజాస్య షణ్ముఖ నిశాకాంతార్క ముఖ్యామర
స్తోమ ప్రస్తుత పూతనాముఁడు సుధాంధోరక్షకుం డంబుద
శ్యాముం డెప్పుడు ప్రోచు నిన్నుఁ గరుణన్ జాగంటి కోటేశ్వరా!

ప్రావీణ్యం బెసఁగంగ శ్రోతృ జనతా భావంబు లాఁకట్టుచున్
భావావేశముతోఁ బురాణకథలున్ బ్రాచీన పద్యంబులున్
టీవీ బుల్లితెరన్ గనంబడి కడున్ ఠీవిన్ వెలారించు ప్ర
స్తావంబుల్ గనుచున్ వినంగఁ దగుఁగా చాగంటి కోటేశ్వరా!

గంగాతుంగ తరంగ రింగణ రవాక్రాంత ప్రతిధ్వానముల్
శృంగారోజ్జ్వల కృష్ణ తాత్త్విక కథా క్షీరాబ్ధి వీచీ రుచుల్
శృంగేరీ మఠ భారతీ యతి మణి శ్రీకర్ణ సద్గేహాళీ
సంగీతంబులు నీ ప్రసంగములగున్ జాగంటి కోటేశ్వరా!

గర్వం బించుక లేదు భూతిసితరేఖల్ బొట్టు కట్టారయన్
గీర్వాణం బసలే కనంబడదుగా గ్రీవోరుశంఖధ్వనిన్
గీర్వాణాంధ్ర పురాణ కావ్యకథలన్ గీర్తించు సద్విద్య నీ
సర్వస్వంబగుఁ గాదె! పండితవరా! చాగంటి కోటేశ్వరా!

నుడికారంబును దీపి తియ్యమును జెన్నున్ జందమున్ బందమున్
వడియున్ సవ్వడి గల్గునట్టి తెనుఁగున్ బాసన్ గతల్ సెప్పు నీ
నుడు లవ్వారిగ నెల్లవారలకు విందుల్ సేయు చామంతి పూ
జడివానల్ గద! మేల్గొనంబుల గనీ! చాగంటి కోటేశ్వరా!

**గడిమెళ్ళ సోమయాజులు శర్మ**



బహుసద్గ్రంథ ప్రశస్త శాస్త్రపఠనాల్ ప్రజ్ఞోన్నతిం బెంచ, స
న్మహితోత్కృష్టపురాణ భాగవతముల్ మానోన్నతిం బెంచ, ని
మ్మహి రామాయణ వేద భారత కథల్ మాన్యోక్తి నందించ, స
త్సహితోద్ధర్మము బోధ సేసెదవయా చాగంటి కోటేశ్వరా!

వినయస్నేహమహత్త్వశీలసహనప్రేమాప్తసత్ప్రజ్ఞ నీ
కనయాడంబరదూరతన్ బెనిచి, సత్యాదర్శముల్ పంచఁగా,
మనమం దెప్పుడు తృప్తిఁ దాల్చుదువు సౌమ్యా! ధర్మసద్బోధనా
ర్చన మర్పింతువు ధారణైక గ్రహణా! చాగంటి కోటేశ్వరా!

దేవీ తత్త్వము, రామనామమహిమల్, దీవ్యచ్ఛివారాధనల్,
భావోద్గమ్యమహత్త్వవేద వివృతుల్, వ్యక్తిత్వసంశోధనల్,
భావాతీత సమంత్ర గమ్య వినుతుల్ భక్త్యబ్ధినిం దేల్చు నీ
సౌవర్ణాంచిత దివ్య బోధన వరాల్! చాగంటి కోటేశ్వరా!

ధర సమ్మోదము నందునట్టులుగ సద్ధర్మంపుఁ బౌరాణికో
ద్ధురవాక్యమ్ములు వల్కు నిన్ను జనముల్ తోరంపు సంశ్లాఘలన్
దిరమౌ రీతిని మెచ్చుచుంద్రు విలసద్దేదీప్యమానాప్తసు
స్వరపౌరాణికసద్గురూత్కరవరా! చాగంటి కోటేశ్వరా!

నీ వధ్యాత్మిక బోధ సల్ప నెడఁదల్ నిత్యమ్ము సద్భక్తి యన్
భావావేశముతోడ నిండి వెలుఁగున్ నవ్యంపు జ్ఞానమ్ముచే;
దైవారాధన మమ్ముఁ దేర్చు నెపుడున్ ధర్మాంబుధిన్ ముంచఁగన్;
జావే లేదయ నీదు బోధనల కో చాగంటి కోటేశ్వరా!

**గుండు మధుసూదన్**

శ్రీవాణీకరుణాకటాక్ష ప్రభలున్ జిహ్వాగ్రమున్ నిల్చుచున్
భావోద్వేగఝరీప్రసంగసుధలన్ వాగ్గంగయే సాగగా
నే వేదార్థ పదార్థమైన వరమై యీదేహులన్ జేరదే
సావాసంబిక నీవె జ్ఞాన తరువా! చాగంటి కోటేశ్వరా!

నానాశాస్త్రవిరాజమానమణులున్ నర్తించు నీవాక్కులన్
నానాకావ్యమరందముల్ చెవులకే యందించు విందుల్ సదా
నానాసూత్రనిబద్ధరత్న మురళీ నాదంబు నీవే యనన్
జ్ఞానాకారము దాల్చితీవు సుగుణా! చాగంటి కోటేశ్వరా!

ప్రణవాకారుని లీలలన్ నయనసాఫల్యంబుగా జూపుచున్
తృణమౌ జీవిత మర్మముల్ దెలుపుచున్ దివ్యాత్ములన్ జేయుచున్
రణముల్ జేసెడు శత్రు షట్కముల ఘోరంబుల్ నివారించగా
జనురాకాంక్షలు రూపుమాపితివహో చాగంటి కోటేశ్వరా!

పరువుల్ దీసెడు జీవితంబులకు నీవాధారమై నిల్చుచున్
వరమై జాతికి ధర్మ మార్గమున సద్భాషించు సన్మౌనివై
గురువై భవ్యమహత్వ జ్ఞానతరువై గోవిందునే జూపుచున్
స్వరమై బ్రోచితివయ్య జీవులనహో చాగంటి కోటేశ్వరా!

ఋషియో కారణజన్ముడో తెలిపెనీ కృష్ణుండు హృద్గీతలన్
విషయంబంతయు విప్పిచెప్పెనని సద్విజ్ఞుల్ నుతుల్ సల్పగా
విషమున్ జిమ్మెడు దుష్టసంస్కృతిని నీవే చక్రివై ద్రుంచుచున్
శశివై చల్లితివయ్య శాంతివెలుగుల్ చాగంటి కోటేశ్వరా!

**డా॥ ఎస్.వి.ఎస్. చారి**



దివ్యంబై శ్రుతిజన్యమై ద్యుమణియై దీపించు హిందుత్వమున్
నవ్యంబౌ గతిలో నఘమ్ము లడగన్ నానార్థభావమ్ములన్
భవ్యంబైన మహాభిమానయుతమౌ భాషానియోగమ్ముచే
శ్రావ్యంబై వినిపింతువీవు ప్రణతుల్ చాగంటి కోటేశ్వరా!

మదిలో వాక్కునఁ గాయమందు మహితమ్మౌ శుద్ధతం జూపుచున్
హృదిలో నిల్చెడు రీతి పామరులకుం హేత్వర్థ ధీజ్ఞానమున్
చిదుమంజేయుచు మోహబంధ లతలన్ జిత్తమ్ములవ్వారికిన్
సదసద్జ్ఞాన ప్రసంగమిచ్చు గురుడా! చాగంటి కోటేశ్వరా!

దేహమ్ముల్ నిలువంగఁ బోవు స్థిరమై దేహమ్ముపైనేల వ్యా
మోహమ్మంచు ప్రజాళికెప్డు ఘనమౌ మోక్షంబు సిద్ధించు స
ద్వ్యూహాధాయకమౌ మరంద సమవాక్ తోయంబు లింపారగా
సౌహార్దంబున మాకు నిచ్చు ఘనుడా చాగంటి కోటేశ్వరా!

వరమై, శారద చంద్రికా లహరియై, భవ్యార్చనమ్మై, మనో
హరమౌ యామని దీప్తియై, తలప నూహాతీతమై సాగు మీ
పరమోత్కృష్ట ప్రసంగమున్ బొగడగా వశ్యంబె నాబోటికిన్
శరణంబంటిని మీపదాబ్జములనే చాగంటి కోటేశ్వరా!

కనగా భక్తిని మించి లేదు ఘన మోక్షంబియ్యగా ధాత్రిలో
ననుచున్బోధన చేసి మా యెదలు భక్త్యావేశసందీప్తిచే
వినుతిం జేయగ దైవమున్ సలుపు నీవే మా పురాపుణ్యమై
జనమౌఢ్యమ్మును కాల్చ వచ్చితివి శ్రీ చాగంటి కోటేశ్వరా!

**డా॥ తొగట సురేశ్ బాబు**

ధారాపాతనితాంత భక్తివచనా! దైవాంశవాగ్భూషణా!
సారాంశోద్భవతత్త్వధర్మనిరతా! సన్మార్గ సంపోషణా!
ధీరోదాత్తులు ధీధిశుల్ వినెడు మీ దివ్యత్వ సంభాషణా
చారమ్ముల్ మది వెల్గు నింపు ఘన శ్రీ చాగంటి కోటేశ్వరా!

పారావారవిహారసర్వజనులన్ పాలించు సంవాహనా
కారారూప విశేష వాణికరుణా కాలోచితాధారణా!
ధూరీణత్వదుపాసనావరకరా! దోదీప్యమానప్రభా!
శౌరీసన్నుతసాంప్రదాయనిధి శ్రీ చాగంటి కోటేశ్వరా!

వాణీవీణల మీటుచుండు సరసన్ వైవిధ్య సాహిత్వతా
బాణీ శ్రేణులు వాన జల్లుల వలెన్ వర్షించు వర్షమ్ము సా
మ్రాణీధూపపు తావిగా విసరునా రాణీసమాహిత్త్వమా
సానీ తానుగ జిహ్వయందు గల శ్రీ చాగంటి కోటేశ్వరా!

లీలాలోకమునందు లేరు కనగా లీలావలోకమ్మునన్
ఆలోఢ్యామృతభక్తితత్వపటిమన్ అందించు నెవ్వారలున్
కాలోద్భాసిత గ్రంధరాజపఠనన్ గావించు సద్బోధకుల్
చాలా జూడగ లేరు మీదు సము శ్రీ చాగంటి కోటేశ్వరా!

జిహ్వాగ్రాన వసించు భారతి సదా జీవాంశజీవాత్మగా
బాహ్యాంభ్యంతరవాయురూపశుకుడై భాసిల్లు పౌరాణికున్
నాహ్వానమ్ముగ చేరి పారు పలుకుల్ ఆహూతులానందితా
స్వాహాకారము నాట్యమాడునట శ్రీ చాగంటి కోటేశ్వరా!

**మాడుగుల మురళీధర శర్మ**



శ్రీగాంభీర్యగళంబు శ్రోత్రపుటముం జేరంగనే తీరఁగా
యోగానందసుఖంబు నందఁ గని భక్త్యుత్సాహపూర్ణాత్ము లెం
తే గాఢాదృతి విన్తు మీ వచనముల్ ధీసాంద్ర నిత్యంబునున్
సౌగమ్యంబుగ సూక్తిసుందరముగా చాగంటి కోటేశ్వరా!

శ్రీమాతాది సహస్రనామముల విశ్లేషించి గూఢార్థముల్
సామాన్యప్రజకేన్ సుబోధకముగా సంధానమున్ జేయఁగా
ధీమాన్యా! బహు శ్రద్ధధానమతులై దీప్తాస్యపద్మంబులన్
సామంబున్ వినునట్టులుందురు గదా! చాగంటి కోటేశ్వరా!

శ్రీమద్భారత వీరగాథలును వంశీమోహనోదారలీ
లామాహాత్మ్యములున్ సవిస్తరముగాఁ బ్రస్తావనల్ సేయు మీ
ధీమత్త్వాలపనామృతంబు శ్రవణోత్సేకంబుగా గ్రోలుచున్
సౌమత్యంబునఁ గూర్తు కేలు జతలన్ చాగంటి కోటేశ్వరా!

అల ప్రాచేతసుఁడున్ బరాశరసుతుం డాబ్రహ్మసంకల్పమున్
ఫలవంతం బొనరింపఁగాఁ బ్రజలను న్భద్రంబుగా జీవనం
బులు సాగింప మహేతిహాసముల సంపూర్ణంబుగాఁ జేయ నా
చలువం జెప్పుచు ధన్యులైతిరి గదా! చాగంటి కోటేశ్వరా!

పరమాచార్యుల వాగ్విలాసములు తద్భవ్యప్రసంగంబులున్
చరితౌన్నత్యవిశేషసంగతులు ప్రస్తావించుచున్ ధర్మబం
ధుర నిత్యవ్యవహారముల్ నుడువ సంతోషంబుతో వందనాల్
సలుపం జాలుదు రాదరోన్నతమతుల్ చాగంటి కోటేశ్వరా!

**రాళ్ళబండి నాగభూషణ శాస్త్రి**




నిగమాంతంబుల సారమున్ గలిపి తా నీమంబులం దెల్పుచున్
నగరాజమ్మున నుండు దేవు కథలన్ నాణ్యమ్ముగా జెప్పుచున్
ప్రగతిన్ బొందెడి భూసురున్ బొగడ నా భాగ్యంబుగా దల్చెదన్
సగణాధ్యక్షుడు మీకు నిచ్చు శుభముల్ చాగంటి కోటేశ్వరా!

ఏయే గ్రంథములన్ బఠించితిరి? ఏయే జ్ఞాన మార్జించిరో?
ఆయా భావములన్ గ్రహించి ప్రజలన్ ఆశ్చర్యమున్ ముంచిరే!
మాయాజాలము మీదు వాక్కులు గదా! మైమర్వజేయన్ యశః
శ్ఛాయా మండల తేజ చంద్ర! ఘనుడా! చాగంటి కోటేశ్వరా!

అంభోరాశిని మించు జ్ఞానమకటా! హర్షంబులున్ సొంతమా
రంభమ్మౌ నల దూరదర్శిని గనన్ రమ్యంపు గాథల్ వినన్
శుంభత్కార్యము మీది గాదె తలపన్ సొంపారు కంఠం బటే
శంభో నాథుని వంకనుండు దమరౌ చాగంటి కోటేశ్వరా!

స్తోత్రంబుల్ కథలున్ సుధర్మములనున్ చోద్యంపు టాచారముల్
మిత్రత్వంబును మంచిపద్ధతులనున్ మీమాంసముల్ సూక్తులున్
నేత్రాల్ నిండగ జేయురీతి నిడుచున్ నిత్యంబు మెప్పింపగన్
ఛత్రంబందరు మీకు పట్ట వలయున్ చాగంటి కోటేశ్వరా!

లలితానామములన్నిటన్ ప్రవచనాలాలిత్య సంపత్తి రం
జిల రామాయణమున్ ముదంబున నిడన్ శ్రీవాం సుశీలమ్మకున్
ఫలమే నీవుగదా! జనావళి మహాభాగ్యంబనంగన్ ఘనో
జ్వలితంబౌ తమ ధారణాపటిమ యో చాగంటి కోటేశ్వరా!

**జగదీశ్ వూదూరి**



కమనీయంబగు నీ ప్రసంగముల వాగ్ధాటిన్ ప్రశంసించు ను
త్తమ భక్తావళి లీనమౌచు విను నత్యాసక్తితో జన్మభా
గ్యముగా భావన చేయుచు న్మదిని జ్ఞానాంభోనిధీ! ధీసమా
జ మహామండన! వందనం బిదియె శ్రీ చాగంటి కోటేశ్వరా!

శ్రీ వాగ్దేవి కృపన్ లభించిన మహా ప్రీతిన్ సువాక్సంపదన్
సేవాభావముతో జనావళికి పంచీయంగ సంకల్పులై
చేవన్ జూపుచు సాగుచుంటిరి కృషిన్ చేదోడుగా గొంచు దీ
క్షా వాగ్వైభవ జైత్రయాత్రలను శ్రీ చాగంటి కోటేశ్వరా!

మే మేభాగ్యము చేసుకొంటిమొ గదా మీవంటి సన్మిత్రునిన్
ధీమార్తాండుని చారు సద్గుణ త్రిమూర్తిన్ పొంద నాంధ్రావనిన్
భూమిన్ కారణజన్ములై వెలసి మమ్మున్ జ్ఞానులన్ జేయగా
స్వామీ! పుణ్యులు కాకినాడ ప్రజ శ్రీ చాగంటి కోటేశ్వరా!

తల్లే ధైర్యము నింపి నీకిడెను ప్రోత్సాహమ్ము రాణించి రా
జిల్లంగన్ సభలందు నా జనని యాశీర్వాదమే శక్తిగా
నుల్లంబందున నిల్చి నిన్నపుడు సద్యోగంబు నీ కబ్బెగా
చల్లంగన్ గన దేవతావళులు శ్రీ చాగంటి కోటేశ్వరా!

**కొడుకుల పురుషోత్తమ్**

++++++++++++++++++++++++++++++++++++++++++++++++++++

వినయం బాకృతి గొన్న రీతి సభలన్ విజ్ఞాన వాగ్ధారలన్
తనువున్ మానసమున్ పవిత్రములుగా ధర్మాభిముఖ్యంబుగా
తనరన్ జేయుచు తాత్త్విక ప్రభల విద్యాదానముం జేయుచున్
జనులన్ భక్తిపథాన నిల్పితివి శ్రీ చాగంటి కోటేశ్వరా!

**అక్కిపెద్ది రామ సూర్యనారాయణ**

ధర్మాధర్మ విచక్షణల్ హృదయమున్ స్థాపించి దీపింపగా
కూర్మిన్ వేదికలెక్కి వేదగరిమన్ కొండాడి లోకంబునన్
కర్మభ్రష్టులనుద్ధరింప వరమై కైవల్యమున్ పొందగన్
శర్మంబున్ ప్రవచింతువే గురువరా! చాగంటి కోటేశ్వరా!

కామక్రోధములారు మానవతతిన్ కార్చిచ్చులై కాల్చ శ్రీ
రామున్ జేరగ సత్కథా శ్రవణమే రంజిల్లు సంసేవయై
క్షేమంబిచ్చును చింతదీర్చునను సంకేతంబుగా ఋగ్యజు
స్సామాధర్వణ సారమున్ తెలిపెదో చాగంటి కోటేశ్వరా!

శ్రీరామాయణ సత్కథా గరిమ సౌశీల్యంబు నేర్పించగా
గౌరీశంకర లీలలీ జగతిలో కారుణ్యమున్ పంచ నీ
హార స్థావర పుత్రి గాథ భవ సంహారంబు గావించ సం
సారాంభోనిధి దాటవేయుదువు శ్రీ చాగంటి కోటేశ్వరా!

**అమరవాది రాజశేఖర శర్మ**

++++++++++++++++++++++++++++++++++++++++++

వర పుత్రుండవు పద్మయోని సతియౌ వాక్కాంతకున్, దీక్షతో
నిరతమ్మున్ ప్రవచించుచున్ భువి జనానీకమ్ము జేజే యనన్
స్థిరమౌ కీర్తిని పొందితే నిజముగా చెన్నైన వాగ్ధారతో
సరిలేరెవ్వరు నీకు పృథ్విపయినన్ చాగంటి కోటేశ్వరా!

ఘనమౌ కీర్తి ఘటిల్లె నీకు గల వాక్చాతుర్య వైదగ్ధిచే
ధనమున్ గోరవు చెప్ప సూక్తులను సద్భావమ్ముతో నెప్పుడున్
వినయమ్మే గద నీదు భూషణము నీ విఖ్యాతి నిక్షిప్తమౌ
జనసందోహపు మానసమ్ముల సదా చాగంటికోటేశ్వరా!

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి**



సురగంగాఝరి సాగినట్లు పదముల్ శ్రుత్యంతరాళాలలో
స్థిరమై, భారత సంస్కృతీయ మహిమన్ శ్రేయమ్ముగా నిల్పు నీ
పరమోత్సాహ ప్రసంగముల్ జగతిలో ప్రఖ్యాతమై యొప్పు నో
స్మరణీయోన్నత శిష్టభాషణ ఖనీ! చాగంటి కోటేశ్వరా!

ఔరా! పల్కులతల్లి నీ వచనమం దత్యంత వేగమ్ముగా
సారోదార పదమ్ములన్ గురియుచున్ సద్గ్రంథ సూక్ష్మమ్ములన్
పారావార గభీర మార్గమున సంభావ్యమ్ముగా దెల్పు, నీ
సారూప్యంబును నెన్న సాధ్యమగునే చాగంటి కోటేశ్వరా!

ధరణీమండల మెల్ల సంపదలకున్ దారాడుచుండంగ న
స్థిరమీ లోకపు భాగ్యమన్న పలుకుల్ తీయమ్ముగా పల్కి యా
చరణంబందున చూపునట్టి ఘనుడా! సాహిత్య సమ్మాన్య! వా
క్సరముల్ నీకివె స్వీకరింపు మనఘా! చాగంటి కోటేశ్వరా!

**గుమ్మా సాంబశివరావు**

✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣✣

నిద్రాణమ్మగు జాతి మేలుకొలుపై నిర్ఘోషమౌ శంఖమై
భద్రమ్మైన పురాణ కావ్యతతికిన్ భండారమై యొప్పుచున్
చిద్రూపమ్ముల వానివైపు జనులన్ జేర్చంగ ధీశాలివై
సద్రావమ్ముల సాగుచుంటి వహహా చాగంటి కోటేశ్వరా!

ధాటిన్ వాగ్ఝరి దివ్య గంగ సమమై ధారాళమై పొంగగన్
కోటల్ గట్టితి భక్తి భావములకున్ కూలంకష ప్రజ్ఞతో
నూటై పొంగ పురాణ కావ్య రసమే యుద్రూత లూగించుచున్
చాటింపన్ భువి నుద్భవించితివిగా చాగంటి కోటేశ్వరా!

**అన్నాపంతుల జగన్నాథ రావు**

మీ పాండిత్యము, మీదు ధర్మ నిరతిన్, మీదైన వాక్చాతురిన్,
మీ పారీణత, మీ దయా హృదయమున్, మీజ్ఞాన సౌభాగ్యమున్,
మీ పద్యంబులు, శాస్త్ర గోష్ఠులరయన్ మీ సాధు వృత్తంబులున్
సాపోగౌతులు లయ్యె నాంధ్రమున శ్రీచాగంటి కోటేశ్వరా!

వ్యాపారంబుగ మారె భక్తియును, దైవత్వంబు నిస్తేజమై,
పాపంబుల్ తొలగించు కార్యమనుచున్ ప్రాపంచిక భ్రాంతినిన్
కాపాడం గలవాడవీవయ! భువిన్ కర్తవ్య నిష్ఠన్ సదా!
శాపంబుల్ తొలిగింప జేయుమిక! శ్రీ చాగంటి కోటేశ్వరా!

వేదాంతంబును తెల్పుచున్ సతతమున్ విజ్ఞాన మందించుచున్
తాదాత్మ్యంబును చెందగా జనులకున్ తత్త్వంబు బోధించున్
భేదాలన్నియు బాపుచున్ భువిని సంవేద్యంబు గావించు ప్రా
సాదంబున్ కొనియాడగా వలెను శ్రీచాగంటి కోటేశ్వరా!

**డా. గుడిసేవ విష్ణు ప్రసాద్**

+++++++++++++++++++++++++++++++++++++++++

వినగన్ వేదపురాణముల్ సకల సంవేదంబులై యొప్పగన్
జనులున్ నివ్వెరబోవుచున్  వినుచు రేజాగాలముం జిక్కి తా
మనుబింబించగ దైవమున్ దలచి యాయాదేవళాల్ గొల్వగా
జనగన్ పుణ్యపు కారకుండవయ! శ్రీచాగంటి కోటేశ్వరా!

సుగుణోపేతుడు సత్యశీలిగను దా శోభించె నీధాత్రిలో
జగతిన్ స్వార్థపు చింతనల్ దెలియవీ చాగంటి యింటన్ సుమీ!
సుగతిన్ జూపుటె వీరి వృత్తి మరి యెచ్చో హస్తముం జాచడే
జగదానందకరుండ వందురు నినున్ చాగంటి కోటేశ్వరా!

**టేకుమళ్ళ వెంకటప్పయ్య**



దారిన్ గానని హైందవమ్ముకను నాదానంపు దృగ్వీధులన్
గారాబమ్మున దోడు నిల్చి కరుణన్ కాంతిచ్ఛటారీతులన్
పారావార సమాన గౌరవములన్ భాస్వంతమౌ వ్యాఖ్యలన్
శౌరిన్ బోలిక తెల్పి బ్రోచితివిగా చాగంటి కోటేశ్వరా!

విరియున్ నీ దరి వాక్కు చేడియ మదిన్ వెల్గొందు ప్రాబల్యులున్
గరిమన్ జేరును శక్తి కన్గొనలలో గౌతూహలీ తూర్ణముల్
కురియున్ గోమిని కాలి యందియలలో ఘూర్ణిల్లు రాగమ్ములున్
సరి లేరే యిట నీకు దిగ్విజయముల్ చాగంటి కోటేశ్వరా!

సిరులన్ లేదిట సౌఖ్యమంచు గరిమన్ జేతోవశీభూతమౌ
వరమౌ మానవ జీవితమ్ములను నీ వాగ్వైఖరీ రీతులన్
పరమార్థంబును నింప బూనితివి నీవా యొజ్జయే సాక్షిగా
చరితంబాయెను పృథ్వి నీ విభవముల్ చాగంటి కోటేశ్వరా!

**డా॥ పుట్టపర్తి నాగపద్మిని**

\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+\+

ధవళంబైన సువస్త్ర ధారణముతో, ధర్మైకభావంబుతో,
స్తవనీయంబగు కంఠసుస్వనముతో జ్ఞానప్రభారాశివై
భవబంధంబుల బాపునట్టి తిరమౌ ప్రజ్ఞాన మందించు సత్
సవనం బొక్కటి సేయుచుంటివి గదా! చాగంటి కోటేశ్వరా!

హింసాదూరుడు వంశపావనుడునై, హీనత్వసంఘాతియౌ
కంసారాతిని డెందమందు సతమున్ గాంక్షించి వీక్షించుచున్
హంసంబో యన దేజరిల్లెదు శుకా! అజ్ఞాన విచ్ఛేదకా!
సంసారంబున నున్నయట్టి ఋషివే! చాగంటి కోటేశ్వరా!

**డి.వి.యం. సత్యనారాయణ**





ధారాశుద్ధవచఃప్రవీణ! గురు వేదస్ఫూర్తిసంపన్న! ధీ
పారావార! గుణాఢ్య! భక్త! ఘనదీప్తా! ఆర్షధర్మావనా!
శ్రీ రామాయణ కావ్యకంఠ! లలితాశ్రీపాదపద్మార్చకా!
సారాసార వివేక! సత్ప్రవచనా! చాగంటి కోటేశ్వరా!

వ్యసనాలంబడి,సంసృతిన్మునుగు నవ్వారిన్ దరింజేర్పగా
నసమానంబగు ప్రజ్ఞ నజ్ఞనుల నధ్యాత్మ ప్రబోధాల వి
శ్వసనీయంబగు సంస్కృతిన్ గరపి యాశాపాశముల్ ద్రెంచుటే
శ్వసనంబై సుధలంద జేయుదువు శ్రీ చాగంటి కోటేశ్వరా!

**డా॥ యస్వీ. రాఘవేంద్ర రావు**

++++++++++++++++++++++++++++++++++++++++

శ్రీమానవతు త్వాం ప్రేమ్ణా చాగంటి కుల దీపకమ్ ।
ఇందిరాలోల నేత్రాంత రోచిః స్నాత ముఖాంబుజః ॥

ఆగమసారం బెల్లను
నేఁ గంటిని పల్కులందు; నీ సరి లేరో
చాగంటి! నందముం జే
కోఁ గంటిని నతుల నందుకోవయ్య సుధీ!

**కోగంటి వేంకటాచార్యులు**

++++++++++++++++++++++++++++++++++++++++

ధన్యంబైనవి తెల్గునేలలు మహాత్మా! నేటి మీ ధార్మికో
పన్యాసంబులు మేలుకొల్పగను; మీ వాక్కుల్ సమాజంబులో
దైన్యంబు బరిమార్చి జాతికిడె జైత్రస్ఫూర్తి; వేరొండు రా
జన్యుండున్ గననట్టిదీ గెలుపు శ్రీ చాగంటి కోటేశ్వరా!

**రసరాజు**



వినసొంపైన గళంబుతో ప్రజలకున్ విశ్వాసమున్ పెంచు రీ
తి నుపన్యాసములెన్నియో కథలు భక్తిన్ పెంచు నాఖ్యానముల్
మనసున్ గెల్చు విశేషసూక్తులను ధర్మార్థంబులన్చెప్పుచున్
జనముల్ మెచ్చెదు పండితోత్తముడ! శ్రీ చాగంటి కోటేశ్వరా!

ఆహా! వీరి పదంబులన్ వినిన ధన్యంబౌ గదా జన్మమున్
ఓహోహో! భళిరా! యటంచు నుతులత్యుత్సాహమున్ మీర దా
సోహంబవ్వరె భక్తులెల్లనిక మీసూక్తుల్ హితోక్తుల్ వినన్
సాహో యంచనరే ఘనుండ! బుధుడా! చాగంటి కోటేశ్వరా!

దైవంబందున భక్తియున్ నిరతమున్ ధర్మంబుపై ప్రేమయున్
జీవంబందున త్యాగమున్ సదయతన్ క్షేమంబు గల్గించుచున్
భావావేశము కల్గజేయు క్రియ సంభాషించుచున్ సంస్క్రియా
సౌభాగ్యంబును గాచు పండితుడ శ్రీ చాగంటి కోటేశ్వరా!

**తపస్వీ**

++++++++++++++++++++++++++++++++++++++++

నీ మార్గంబది సంప్రదాయమునకున్ నీరాజనంబై ప్రజా
క్షేమంబొప్ప నవీనమై వెలుగు, నీ చిత్తంబు ధర్మోజ్జ్వలం
బౌ మార్గంబున బోవుచుండు గుణరమ్యా! నీదు పాండిత్యముల్
సామాన్యంబగునే? యుదారచరితా! చాగంటి కోటేశ్వరా!

ధారావాహికలౌ పురాణచయ గాథాతత్త్వముల్ గ్రోలుచున్
పారావార గభీర తుల్యమగు నీ వాగ్ధారలన్ శ్రోత లెం
తో రమ్యంబుగ మున్కతేలెదరు నీతో సాటి లేరెవ్వరున్
సారాచార విచార శాస్త్ర విభవా! చాగంటి కోటేశ్వరా!

**పింగళి వేంకట కృష్ణారావు**

ధర్మంబే తన మార్గమంచు శివచైతన్యమ్ము గుప్పించుచున్
మర్మంబైన సనాతనార్ష గతులన్ మాధుర్యమౌ రీతిగా
ధర్మాధర్మ వివేకమీయ ప్రజకున్ ధన్యాత్ములన్ జేయ ధీ
చర్మంబున్ ధరియించినట్టి గురుడా చాగంటి కోటేశ్వరా!

మందారమ్ము వలెన్ సుధారసధునీ మాధుర్య వాక్శుద్ధికిన్
సందేశాత్మక కంఠమెత్తి ధరపై సామాజికాంశంబులన్
సందర్భార్థక రీతిగా సకలమౌ శాస్త్రంబు లొప్పారగా
సంధానింపగ వేదవేద్యుడవె శ్రీ చాగంటి కోటేశ్వరా!

జ్ఞానాంబోధి సుశీలధారి స్వరవిజ్ఞానంబు గైకొంటి వీ
గానానన్ జనముల్ శ్రుతిస్మృతులచే కైకొల్పు నిష్కామిగా
వీణాపాణికి పుత్రుడౌ ప్రవచనోర్వీనాథు నే గొల్చెదన్
సానందామృతమూర్తివౌ నరవరా చాగంటి కోటేశ్వరా!

**నమిలకొండ సునీత**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

ఎంతో కాలము నీరులేని మరుభూమెండన్ బగుళ్లొప్పగా
సంతాపమ్మును తీర్చగా ప్రబలవర్షాపాత మేరీతిగా
సంతోషమ్మును కూర్చునో విహితమౌ శాస్త్రోక్తసారమ్ము నా
సాంతంబున్ వినిపించినట్టి మహితా! చాగంటికోటేశ్వరా।

ఉద్యోగమ్మునుఁ జేయుచున్ బ్రతిదినం బూళ్ళెన్నియో పోవుచున్
సద్యఃకాలపు వేషభాషల ననుష్ఠానంబులన్ వీడకే
పద్యానేకశతమ్ములన్ విరివిగా వల్లించు పాండిత్యమున్
సాధ్యంబెట్టుల చేసుకొంటివౌ గదా చాగంటికోటేశ్వరా!

**పప్పు భోగారావ్**



శ్రవణానందకరోరు వాగమృతధారాస్నాత భక్తోత్కరా!
వివిధామ్నాయ పురాణ వాఙ్మయ బృహద్విజ్ఞాన రత్నాకరా!
శివమౌ హైందవ సంప్రదాయమును రక్షింపన్ సదుద్బోధనా
సవనంబెప్పుడుజేయు మీకు ప్రణతుల్ చాగంటి కోటేశ్వరా!

శుకుడో? శౌనకుడౌనొ? శంకరుడొకో? సూతుండొ? దేవర్షియో?
మకరందోపమ వాగ్విభూతిరుచులన్ మాయాజ్ఞతల్ మాపి ధా
ర్మికతత్వంబును బాదుకొల్పనిలఁ జన్మించెన్ త్వదీయాకృతిన్!
సకలార్థంబులు గూర్చు మీవచనముల్ చాగంటి కోటేశ్వరా!

**బొమ్మరాజు ఆదినారాయణ**

++++++++++++++++++++++++++++++++++++++++++

నరసింహాది కవీంద్రులే గడన సన్నాహంబు జేయన్ సభన్
మెరుపై విత్తుల రామలింగ కవితా మేధావి సంహూతిగా
దరిసింపన్ సుకృతంబు శర్మ దెస మైదానమ్ము ప్రస్కందముల్
ఝురులౌ దైవత వృత్తముల్ వివరణల్ చాగంటి కోటేశ్వరా!

**అయ్యలసోమయాజుల సుబ్బారావు**

++++++++++++++++++++++++++++++++++++++++++

శ్రీరాముం డభిమానదైవమిక నా సీతమ్మ మీ తల్లియౌ
వారిం దల్చినయంత మారుతివలెన్ వార్ధిక్రియన్ బొంగెదున్
సారాసారవివేక సంభరితమౌ స్వాంతమ్ము తద్వాక్సుధా
సారాసిక్తతనుల్ జనావళులహో! చాగంటి కోటేశ్వరా!

**ఆచార్య వెంపటి కుటుంబ శాస్త్రి**





పరమున్ గంటిమి ధర్మమార్గ గమన వ్యాపార సంప్రాప్త సు
స్థిరమౌ మోక్షఫలంబు గంటిమిలపై చీకాకులం గూల్చగా
ఖరఖడ్గంబుల గంటిమొక్కతటి వాగ్వ్యాహ్యాళిలో చంద్రికా
సరణుల్ గంటిమి సుమ్ము మీగళమునన్ చాగంటి కోటీశ్వరా!

ఆలాఫ్ దీ తెలుగూ విలేజి సిటిజన్స్ హైలీ కనెక్టెడ్ టు యూ
టేలెంటీజు డివోషనల్ పవరుఫుల్ టేకాఫ్ డివైన్ క్వాలిటీ
ఫాలోయింగ్ ద స్పిరిచ్యువల్ లిటరసీ స్పాంటేనియస్ గ్రావిటీ
సైలెంట్లీ లిజనింగ్ యువర్స్ డెయిలీ చాగంటి కోటేశ్వరా!

**మావుడూరు సూర్య నారాయణ మూర్తి**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

ధారాపాత వచస్సుధారసఝరిన్ తాదాత్మ్యధీసద్గుణ
శ్రీరమ్యాన్విత సుప్రసంగములతో చిన్మోదమున్ గూర్చి, లో
కారాధ్యుండవుగా పురాణముల మాన్యత్వంబు హెచ్చించితో
సారాచారవిచార ధీరవర! శ్రీ చాగంటికోటేశ్వరా!

**ఎస్ సాయిప్రసాద్**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

కలిలో హైందవ జాతినిన్ గరుణతో గాపాడగా బుట్టితో?
లలితాఖ్యానమునన్ సమర్థముగ నుల్లాసంబునన్ స్థాస్నుతన్
చిలుకన్జాలితివయ్య సత్కథల నీసృక్వమ్ముపై జార్చుచున్
సలుపన్ జోతలు చాలునే తమకు శ్రీ చాగంటికోటేశ్వరా!

**కళ్ళే నరసింహం**



కేలన్ బట్టగ వీణ గానక మదిన్ కించిత్తు చింతిల్లుచున్
మాలాపుస్తకపాణి వాణి యొక పద్మమ్మెక్కగన్ బ్రహ్మ యీ
భూలోకమ్మున దాని మానవునిగా బుట్టించె మీరూపుగా
జాలమ్మున్ బడనీక బ్రోవ జనులన్ చాగంటి కోటేశ్వరా!

కాలమ్మెంతయొ మారిపోయినది ఈ కాలమ్ములోవారికిన్
ఈలాగుండును సంప్రదాయమనుచున్ ఏరీతిగా జెప్పినన్
ఆలోచింతురొ యట్లు జెప్పి ప్రజకాహ్లాదమ్ము కల్పించుచున్
చాలా నేర్పితిరయ్య మీ సుభాషణములన్ చాగంటి కోటేశ్వరా!

**మోహన్, టెక్సాస్**

+++++++++++++++++++++++++++++++++++++++

జనులెన్నో వ్యథలందు మున్గుచు మనస్తాపంబులన్ బొందగన్
ఘనమౌ సూక్తుల తోడ నీవు పలు లౌక్యంబుల్ ప్రబోధించగా
విని సారంబునెరింగి సత్త్వమున దైవేచ్ఛన్ శిరోధార్యమై
చనగా జెల్లు వివేకవంతులగుచున్ చాగంటి కోటేశ్వరా!

**కవిశ్రీ సత్తిబాబు**

+++++++++++++++++++++++++++++++++++++++

పారాశర్యునివో! పురాణమయమై భాసిల్లె మీరూపు, వా
గ్ధారాశుద్ధికి మిన్నువాకగ ప్రసంగాలెంతొ రంజిల్లె, నౌ
రౌరా! శంకరు వాఙ్మయమ్ము మరియున్ రామాయణమ్మైన సం
సారుల్, పండితులెల్ల మెచ్చ, జయహో! చాగంటికోటేశ్వరా!

**గుడ్లూరి వేంకటేశ్వరరావు**

రాజిల్లెన్ ప్రజలందు మీ వలన శాస్త్రజ్ఞాన సంపత్తి వి
భ్రాజిల్లెన్ మిగులన్ సమాజమున సౌభాగ్యంబు మీ వల్ల నో
రాజర్షీ! ప్రవచించు చుంటిరి సమర్థత్వంబునన్ ధర్మముల్
సౌజన్యంబున సూతమౌని పగిదిన్ చాగంటి కోటేశ్వరా!

జలధిం గ్రోలె నగస్త్యు డందు రది యాశ్చర్యంబె? మీ రిప్పు డు
జ్వల వేదాంత పురాణ సార జలధిన్ బంధింపరే బుక్కిటన్!
గలదే యిట్టి యనర్గళం బయిన వాగ్వైచిత్రి యెందేని? ని
శ్చలమై వెల్గెను మీ యశం బిల సుధీ! చాగంటి కోటేశ్వరా!

**యలమర్తి మధుసూదన**

***************************************

పరమామ్నాయపథంబు జూపి, పరతత్త్వంబున్ బ్రబోధించుచున్
కరుణాంతఃకరణుండు దైవమె భువిన్ గన్పట్ట సాకారుడై
గురురూపంబున, మౌనమున్ విడుచు భర్గున్ దక్షిణామూర్తిగా
చరణాంభోజములంటి కొల్తు నిను శ్రీ చాగంటి కోటేశ్వరా!

**డా॥ తూములూరి దక్షిణామూర్తి**

***************************************

నీ రూపమ్ము మనఃప్రమోదముగదా నిక్కంబుగా శాస్త్రవా
గ్ధారల్ జీవనదీప్రవాహములుగా ధన్యాత్ములన్ జేయు సం
సారాఘాళి తొలంగజేయుచును శిష్టత్వమ్ము నందించెడిన్
సారోదారపురాణపూర్ణహృదయా! చాగంటికోటేశ్వరా!

**దేవరకొండ రామసుబ్రహ్మణ్య శర్మ**



మతిమంతుల్ కలవైన సంఘమున సన్మార్గమ్ము బోధించు వా
క్తతి హాస్యాస్పదమైన వేళల, భవత్ వ్యాఖ్యాన వైదుష్య భూ
షితమై తెన్గుల జీవితమ్మున ప్రవేశించెన్ పురా భారతీ
సతి మాహాత్మ్యము వేదవాఙ్మయము శ్రీ చాగంటి కోటేశ్వరా!

**ప్రొ. శ్రీపెరుంబూదూర్ లక్ష్మణమూర్తి**

++++++++++++++++++++++++++++++++++++++++++++

జాతిన్ ధర్మపథంబునందు నడుపన్ సంస్కారమున్ నేర్పుచున్
చేతోమోదము గాగ సంశయము విచ్ఛేదమ్ము గావించుచున్
ప్రీతిన్ దైవముపట్ల భక్తి మదిలో పెంపొందగా జేయు మీ
చాతుర్యంబు చిరాయువై మనుత! శ్రీ చాగంటి కోటేశ్వరా!

**మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి**

++++++++++++++++++++++++++++++++++++++++++++

భవబంధమ్ముల వీడుచున్ జనులు సంపాదింప విజ్ఞానమున్
భువిపై శాంతియు సౌఖ్యముల్ సుమములై పూయంగ నీవెంచుచున్
ప్రవచింపన్ విని నా సనాతనియె హర్షమ్మంది దీవింపగన్
జవులూరింపగ బల్కుచుండెదవు శ్రీ చాగంటి కోటేశ్వరా!

**మాచవోలు శ్రీధరరావు**

++++++++++++++++++++++++++++++++++++++++++++

అవనిన్ నిండిన యంధకారమును మీ యధ్యాత్మ భావంబుతో
సవరింపన్ విధిగా తలంచుటను మీ సంస్కారమున్ గాంచితిన్
భవమున్ ధన్యము జేయగా జనులకున్ భక్తిప్రపత్తుల్దగన్
చవులూరెన్ తమ శేముషీ విభవముల్ చాగంటి కోటేశ్వరా!

**యెల్లికంటి జ్ఞానప్రసూనాశర్మ**

ఆలోచించిన నెన్నిరీతులను మాకర్థమ్ముగానట్టి యా
మూలజ్ఞానపు మర్మమెల్ల మదిలో మోదమ్మునన్నింపుచున్
మాలో చేతన గల్గజేసితివయా మాపూర్వపుణ్యమ్మునన్
చాలా నేర్చితిమయ్య మీసుభాషణములన్ చాగంటి కోటేశ్వరా!

**రామ మోహన్, బుక్కపట్నం**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

కలకాలమ్ము గడించు పుణ్యమును మాకై ప్రేముడిం బంచి యి
క్కలి కాలాఘ విషజ్వరంబున బడంగా నీక మాధుర్య సూ
క్తులఁ నిత్యం బిడి బోధనామృతము మాకున్ రక్షయై తోడ్పడన్
జలసూత్రంబుగ నుంటిరీ జగమునన్ చాగంటి కోటేశ్వరా!

**రుద్రరాజు శ్యామల**

✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤✤

ఘనమౌ రీతిని సర్వశాస్త్రముల సూక్ష్మాలన్ని బోధించుచున్
మనముల్ రంజిల నాపురాణముల మర్మాలన్ని వాక్రుచ్చుచున్
జనముల్ మ్రొక్కగ సద్గురుండవని యజ్ఞానాంధకారమ్ము నా
శనమౌనట్టులఁ జేసితీవిటుల శ్రీ చాగంటి కోటేశ్వరా!

**విట్టుబాబు**













